# పది ఫలితాల్లో వికారాబాద్ కు చివరి స్థానం..

### -ఉత్తీర్ణతలో బాలికలదే పై చేయి..

**వికారాబాద్,ఏప్రిల్ 30, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ప్రకటించిన పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో వికారాబాద్ జిల్లా చివరి స్థానంలో నిలిచింది. జిల్లాలో ప్రభుత్వ, ఎయిడెడ్, ఆశ్రమ, గురుకుల, మాడల్, ప్రయివేట్ పాఠశాలలు 302 ఉన్నాయని, జిల్లాలో 13,357 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా 8,695 మంది విద్యార్థులు ఉత్తీర్ణులైనట్లు విద్యాశాఖ అధికారులుత ఎలిపారు. అందులో 6,664 బాలురు హాజరు కాగా, 3,821 మంది బాలుర విద్యార్థులు ఉత్తీర్ణులు అయ్యారు. అదేవిధంగా 6,693 మంది బాలికలు పరీక్షకు హాజరు కాగా, 4,874 మంది బాలికలు ఉత్తీర్ణులయ్యారు. మొత్తం బాలురు 57.34 శాతం ఉత్తీర్ణత సాధించగా, బాలికలు 72.82 శాతం ఉత్తీర్ణ సాధించినట్లు అధికారులు పేర్కొన్నారు. ఉత్తీర్ణత పొందిన విద్యార్థులలో బాలికదే పై చేయి నిలిచింది. మొత్తానికి వికారాబాద్ జిల్లాలో 65.10 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులైనట్లు అధికారులుత ఎలిపారు.



రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్

వార్త

# మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాలో పదవతరగతి పరీక్షల్లో 89.61శాతం ఉత్తీర్ణత

### - ఫలితాల్లో బాలికలదే పై చేయి..
### -జిపిఏ 10|10 సాధించిన వారిలో 1652 మంది విద్యార్థులు
### -మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా డిఇఓ విజయకుమారి

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 30, ప్రభాతవార్త**

మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాలో పదవతరగతి-మార్చి 2024 పరీక్షా ఫలితాల్లో జిల్లాలో 89.61శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. మంగళవారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పదవతరగతి ఫలితాలను వెల్లడించింది. 2024మార్చి 18 నుంచి ఏప్రిల్ 2వ తేదీ వరకు పదవతరగతి పరీక్షలు నిర్వహించిన సంగతి తెలిసిందే. మంగళవారం మేడ్చల్ జిల్లా పదవతరగతి పరీక్షా ఫలితాలు వెల్లడి కావటంతో జిల్లాకు సంబంధించిన ఫలితాల వివరాలను జిల్లా విద్యాశాఖ అధికారిణి విజయకుమారి వివరించారు. జిల్లాలో ప్రభుత్వ,ప్రైవేట్ మొత్తం పాఠశాలలు 896 ఉన్నట్లు తెలిపారు. పదవతరగతి పరీక్షలకు హాజరైన విద్యార్థులు 46,736మంది ఉండగ, వీరిలో ఉత్తీర్ణులైన విద్యార్థులు 41,879 మంది ఉన్నట్లు తెలిపారు. మొత్తం 89.61శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. పరీక్షలకు హాజరైన బాలురు 24,192మంది ఉండగ, వీరిలో ఉత్తీర్ణులైన బాలురు 21,131 ఉన్నట్లు బాలుర శాతం (87.35శాతం) ఉత్తీర్ణులు కావటం జరిగిందన్నారు. పరీక్షలకు హాజరు బాలికలు 22,544మంది ఉండగ వీరిలో 20,748మంది ఉత్తీర్ణులైనట్లు (92.03శాతం) మంది బాలికలు ఉత్తీర్ణులైనట్లు తెలిపారు. ఉత్తీర్ణులైన మొత్తం విద్యార్థులలో జిపిఏ సాధించిన వారిలో 1652మంది ఉన్నట్లు డిఇఓ విజయకుమారి తెలిపారు.పదవతరగతి పరీక్షా ఫలితాల్లో బాలికలు అత్యధిక మంది ఉత్తీర్ణులయ్యారు. పదవతరగతి పరీక్షా ఫలితాలు వెల్లడి కావటం ఉత్తీర్ణత సాధించిన విద్యార్థుల్లో హర్షం వ్యక్తం అయింది.

**..జిల్లాలోని మేడిపల్లి మండలంలోనే అత్యధికంగ 93.52శాతం ఉత్తీర్ణత..**

మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాలోని 14మండలాల్లో మండలాల వారీగ పదవతరగతి పరీక్షా ఫలితాలు ఇలా ఉన్నాయి. అయితే జిల్లా వ్యాప్తంగ పరిశీలిస్తే జిల్లాలోని మేడిపల్లి మండలంలోనే అత్యధికంగ 93.52 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. కూకట్‌పల్లి మండలంలో 92.88శాతం, మేడ్చల్ మండలంలో 91.43శాతం, బాచుపల్లిలో 90.95శాతం, దుండిగల్‌లో 90.49శాతం, కుత్బుల్లాపూర్‌లో 90.24శాతం, ఉప్పల్‌లో 88.15శాతం, అల్వాల్‌లో 88.12శాతం, కీసరలో 88.07 శాతం, ఘట్‌కేసర్‌లో 87.85శాతం, శామీర్‌పేటలో 87.53శాతం, కాప్రాలో 87.21శాతం, బాలానగర్‌లో 86.89శాతం, మల్కాజ్‌గిరిలో 86.68శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. జిల్లా వ్యాప్తంగ పదవతరగతి పరీక్షల్లో 89.61శాతం విద్యార్థులు ఉత్తీర్ణులు కావటం జరిగింది.

# ఉద్యోగులందరూ పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వినియోగించుకోవాలి

### -జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి ప్రభాతవార్త :**





ఎన్నికల విధులలో పాల్గొనే ఉద్యోగులందరూ తప్పనిసరిగా తమ ఓటు హక్కు పోస్టల్ బ్యాలట్ ద్వారా వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి అన్నారు.మంగళవారం కలెక్టరేట్ సమావేశం హాలులో ఓటురు స్పెసిలిటేషణ్ సెంటర్ ఏర్పాటు,జిల్లాలో ఎన్నికల విధులలో పాల్గొనే ఉద్యోగులందరూ పోస్టల బ్యాలట్ ద్వారా తమ ఓటును వినియోగించుకోవాలని,పోస్టల బ్యాలట్‌పై పూర్తి అవగాహన కలిగి ఉండాలని అన్నారు.అందుకోసం ఎన్నికల సంఘం పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసే సౌకర్యం కల్పించడం జరిగిందని,మీకు ఓటు హక్కు ఉన్న నియోజకవర్గం సంబంధించిన అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో పోస్టల్ బ్యాలెట్ ద్వారా మీరు ఓటు వేసే సెగ్మెంట్ వారిగా ఎన్నికల విధులలో ఉన్న వారికి పోస్టల బ్యాలెట్ ఇస్తారు.ఎంప్లోయ్ ఐడి చూసుకొని పోస్టల్ బ్యాలెట్ దరఖాస్తు ఫారం-12డి ద్వారా వివరాలు ఇవ్వాలని ఎన్నికల విధుల సర్టిఫికెట్ బ్యాలెట్ ప్రిపరేషన్ జరుగుతుందని అన్నారు.పోస్టల బ్యాలెట్ ద్వారా ఓటు వేసిన తర్వాత 13-బి కవర్‌లో పెట్టి సీల్ చేయాలని,కవర్ సీలు చేసే విషయంలో అజాగ్రత్తగా ఉండవద్దని ,పోస్టల బ్యాలెట్‌ను వదిలి పెట్టి బయటకు వెళ్లవద్దని రికార్డులో ఒక్క ఓటు కూడా తేడా రాకుడదని రిజిస్టర్లు ప్రాపర్‌గా నిర్వహించాలని తప్పులు లేని ఓటరు స్పెషాలిటీ సెంటర్‌లు ఉండాలని కలెక్టర్ తెలిపారు.ఈ సమావేశంలో ట్రైని కలెక్టర్ ఉమా హారతి,కార్మిక శాఖ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాస్ రావు,మస్టర్ ట్రైనర్ వీరకాంతం సంబంధిత అధికారులు,ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షకు ఏర్పాట్లు చేయాలి

### -జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి ప్రభాతవార్త :**

గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షకు పకడ్బంధీగా ఏర్పాట్లు చేసేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు.జూలై మాసంలో నిర్వహించే గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షకు సంబంధించి తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ మహేందర్ రెడ్డి ఉన్నతాధికారులతో కలిసి జిల్లాల అదనపు కలెక్టర్లు,అదనపు ఎస్పీలు,రిజినల్ కో ఆర్డినేటర్‌లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ సందర్భంగా చైర్మన్ గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష నిర్వహించే నేపథ్యంలో చేపట్టాల్సిన విధి విధానాలను అధికారులకు సూచించారు.అనంతరం పోలీస్,రెవెన్యూ అధికారులతో అదనపు కలెక్టర్ మాట్లాడుతూ...జిల్లాలో గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష నిర్వహించేందుకు 6500 మంది అభ్యర్థులు పరీక్ష రాసేందుకు వీలుగా సామర్థ్యం 17 పరీక్ష కేంద్రాలను గుర్తించడం జరిగిందన్నారు.వికారాబాద్‌లో 9,తాండూరులో5,పరిగిలో 3 కేంద్రాలలో పరీక్షల నిర్వహణకు అన్ని వసతులతో సిద్ధం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.టిఎస్ పిఎస్సి చైర్మన్ సూచనల మేరకు పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా మౌలిక సదుపాయాలతో పాటు ప్రహారీ గోడ ,విద్యుత్,టాయిటెట్స్,తాగునీరు ఉండే విధంగా చూసుకోవాలని తెలిపారు.పరీక్ష సమయంలో పూర్తి పోలీసు బందోబస్తు మధ్య పరీక్ష నిర్వహణ చేపట్టాలని సూచించారు.కలెక్టరేట్ నుండి ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డి,కలెక్టరేట్ పరిపాలన అధికారి అమరేందర్ కృష్ణ,సర్కిల్ ఇన్స్‌పెక్టర్ వెంకటేశంలు ఉన్నారు.

# సి-విజిల్ యాప్‌ను బాధ్యత గల పౌరులుగా డౌన్‌లోడ్ చేసుకోవాలి

### -ఎన్నికల్లో అక్రమాలు,ఉల్లంఘనలపై ఫిర్యాదులు చేయవచ్చు
### -మేడ్చల్ జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ గౌతమ్

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 30, ప్రభాతవార్త**

బాధ్యత గల పౌరులుగా ఎన్నికలలో అక్రమాలు, ఉల్లంఘన పై ఫిర్యాదు చేయాలనుకుంటే సి విజిల్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని మేడ్చల్ జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ గౌతమ్ తెలిపారు. మంగళవారం ఆయన పేర్కొంటూ ఎన్నికల కమిషన్ రూపొందించిన సి-విజిల్ యాప్‌ను మొబైల్‌లో యాప్‌లో గూగుల్ పే స్టోర్‌లో డౌన్‌లోడ్ చేసుకుని మొబైల్ నందు నెంబర్ ద్వారా దానిలో రిజిష్టర్ చేసుకోవాలి తదుపరి ఓటిపి వస్తుందని, దానిని నమోదు చేస్తే సి.విజిల్ యాప్ సిద్ధమైనట్లేనని దాని ద్వారా మీరు ఎన్నికల అక్రమాలపై పిర్యాదు చేయవచ్చని ఆయన తెలిపారు. ఎన్నికల నియమావళికి భిన్నంగ ఉన్న దేనిపైనైనా ఫిర్యాదు చేయవచ్చని అన్నారు. సి.విజిల్ యాప్ ద్వారా ఎవరైనా డబ్బులు పంపకాలు, ఉచితాలు, ఓటర్లను ప్రలోభపెట్టిన మద్యం సరఫరా చేసినా, నేరపూరిత చర్యలతో భయభ్రాంతులకు గురిచేసిన లెక్కకు మించిన ఖర్చులు చేసినా, మతపరమైన ప్రసంగాలు చేసినా, ఫిర్యాదులు తాజాగా ఫోటోలు తీసి వీడియోలు తీసి, ఆడియో రికార్డులు చేసి సి విజిల్ యాప్‌ద్వారా ఫిర్యాదులు చేయవచ్చన్నారు. ఎక్కడైనా ఎన్నికల కోడ్ ఉల్లంఘన జరిగిందో దానికి సంబంధించిన ఫోటో లేదా వీడియో తీసి యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. 100నిమిషాలలోపే ఉల్లంఘనపై చర్యలు తీసుకుంటామని జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ గౌతమ్ పేర్కొన్నారు. సి.విజిల్ యాప్‌లో అప్లోడ్ చేసిన ఫిర్యాదులను చేసిన వెంటనే జిల్లా ఎన్నికల అధికారి నియంత్రణలో గల మానిటరింగ్ సెల్‌కు తెలుస్తుందని, తదుపరి ఐదు నిమిషాలలోపు క్షేత్రపరిశీలన అధికారి అయిన ఎఫ్ఎస్‌టి టీమ్ విచారణ నిమిత్తం పంపబడుతుందన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్ 15నిమిషాల్లో ఫిర్యాదుతో తెలిపిన స్థలంనకు చేరుకుని క్షేత్ర విచారణ చేసి 30నిమిషాల్లో వివరాలు సేకరిస్తారని అన్నారు. 24గంటల పాటు సి-విజల్ యాప్ పర్యవేక్షణ జరుగుతుందన్నారు. సి.విజిల్ యాప్‌లో ఫిర్యాదులు చేసే వ్యక్తులు పక్కా ఆధారాలతో ఫిర్యాదు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి గౌతమ్ సూచించారు. సమయం వృధా చేయకుండ పక్కా ఆధారాలు ఉంటేనే ఫిర్యాదు లు చేయాలని ఆయన సూచించారు. జిల్లా వ్యాప్తంగ ఇప్పటి వరకు సి-విజిల్ యాప్ ద్వారా 40కేసులు నమోదు చేయటం జరిగిందని కలెక్టర్ గౌతమ్ తెలిపారు.

# మేడ్చల్ బిఆర్ఎస్‌కు మరో షాక్

### -బిజెపి తీర్థం పుచ్చుకున్న మేడ్చల్ మాజీ జడ్పిటిసి శైలజా హరినాథ్
### -బిజెపి జాతీయ అధ్యక్షుడు నడ్డా సమక్ష్యంలో చేరిక

**మేడ్చల్, ఏప్రిల్ 30. ప్రభాతవార్త :**



బిజెపి జాయతీ అధ్యక్షుడు నడ్డా సమక్ష్యంలో బిజెపిలో చేరిన మేడ్చల్ మాజీ జడ్పిటిసి శైలజా హరినాథ్

మేడ్చల్‌లో బీఆర్ఎస్‌కు మరో షాక్ తగిలింది. మేడ్చల్ బిఆర్ఎస్‌లో క్రీయశీలకంగా పని చేసిన మాజీ జడ్పిటిసి శైలజా హరినాథ్ బిజెపి తీర్థం పుచ్చుకున్నారు. పార్టీకి ఎనలేని సేవలు అందించడంతో పాటు విషయంపై అవగాహనతో మాట్లాడే నాయకురాలిగా గుర్తింపు తెచ్చుకున్న శైలజా హరినాథ్‌కు బిఆర్ఎస్‌లో సముచిత స్థానం కల్పించలేదని ఆమె ఆ పార్టీకి రాజీనామా చేశారు. బిజెపి జిల్లా అధ్యక్షుడు విక్రంరెడ్డి, నియోజకవర్గ కన్వీనర్ మోహన్‌రెడ్డి, నాయకులు నందారెడ్డి, నర్సింహరెడ్డి, మల్లికార్జున్ ముదిరాజ్‌ల ఆధ్వర్యంలో సోమవారం రాత్రి బిజెపి జాతీయ అధ్యక్షుడు నడ్డా, రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, మల్కాజ్‌గిరి బిజెపి ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్ సమక్ష్యంలో బిజెపి చేరారు. ఈ సందర్బంగా ఆమెకు నాయకులు కండువా కప్పి పార్టీలోకి అహ్వానించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ బిజెపి పార్టీ అభివృద్ధికి పాటుపడుతానని, పార్లమెంట్ ఎన్నికల్లో ఈటల రాజేందర్ గెలుపు కోసం కృషి చేస్తానని అన్నారు. ఈ ఎన్నికల్లో దేశంలో బిజెపి అత్యధిక స్థానాల్లో విజయం సాధించి మూడో సారి మోదీ ప్రధానమంత్రి కావడం తథ్యమని అన్నారు.

# ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలి

### -మల్టీజోన్-2 ఐజిపి సుధీర్ బాబు

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి ప్రభాతవార్త :**



జిల్లాలో పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతమైన వాతావరణంలో జరుగుటకు ప్రతి ఒక్కరూ క్రమశిక్షణ,సమయస్పూర్తితో పని చేయాలని మల్టీజోన్-2 ఐజిపి సుధీర్ బాబు పేర్కొన్నారు.మంగళవారం జిల్లాలో ప్రశాంతమైన ఎన్నికల నిర్వహణ కొరకు మల్టీజోన్-2 ఐపిజి సుధీర్ జిల్లా పోలీస్ కార్యాలయాన్ని, వికారాబాద్ టౌన్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు.ఈ సందర్భంగా ముందుగా జిల్లా పోలీస్ కార్యాలయానికి సుధీర్ బాబు రాగ జిల్లా ఎస్పీ కోటిరెడ్డి పూలబోకే ఇచ్చి స్వాగతం పలికారు. అనంతరం ఐపిజి జిల్లా ఎస్పీతో జిల్లాలో పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతమైన వాతావరణంలో జరిగే విధంగా తీసుకోవాల్సిన చర్యలు,పాటించాల్సిన నియమ నిబంధనలపై చర్చించారు. అనంతరం వికారాబాద్ టౌన్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన కార్యక్రమంలో వికారాబాద్ సబ్ డివిజన్ డిసిపి ,వికారాబాద్ ఇన్స్‌పెక్టర్ ఐజిపికి పూలబోకే ఇచ్చి స్వాగతం పలికారు.పోలీస్ అధికారులు సిబ్బందితో మాట్లాడుతూ... పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతమైన వాతావరణంలో జరిగే విధంగా ప్రతి ఒక్కరూ క్రమశిక్షణతో సమయస్పూర్తితో పనిచేయాలని ,అక్రమ మద్యం ,అక్రమ డబ్బు రవాణాపైన ప్రత్యేక నిఘా పెట్టాలని,ఎన్నికల సందర్భంగా జిల్లాలో ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును ప్రశాంతమైన వాతావరణంలో స్వేచ్ఛగా వేసుకొనే విధంగా చర్యలు తీసుకోవాలని,ఓటర్లకు ఎవరు కూడా ప్రలోబలకు గురి చేయకుండా చూడాలని,జిల్లాలో ఉన్న రౌడీ షీటర్స్,సెస్పెక్ట్స్ పైన నిఘా పెట్టాలని ,చెక్ పోస్టులులలో తనిఖీలు మరింతగా పాటిష్టం చేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా కోటిరెడ్డి,వికారాబాద్ డిఎస్పీ శ్రీనివాస్ రెడ్డి,వికారాబాద్ టౌన్ పోలీస్ స్టేషన్ ఇన్స్‌పెక్టర్ నాగరాజు,అధికారులు, సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

# ఉరి వేసుకొని ఆర్టీసి డ్రైవర్ ఆత్మహత్య

### -ఉన్నతాధికారుల వేధింపులే ఆత్మహత్యకు కారణమంటూ సూసైడ్ లెటర్
### -డిపో మేనేజర్,మరో ముగ్గురిపై పోలీసులకు పిర్యాదు

**యాలాల ఏప్రిల్ 30,ప్రభాతర్త :**

చెట్టుకు ఉరి వేసుకొని ఓ ఆర్టీసి డ్రైవర్ మృతి చెందాడు.ఈ సంఘటన యాలాల పోలీస్ స్టేషన్ పరిధిలోని దౌవు లాపూర్ గ్రామంలో చోటుచేసుకుంది.ఆత్మహత్యకు తాండూరు ఆర్టీసి డిపో మేనేజర్,మరి కొంత మంది కారణమంటూ మృతుడు సూసైడ్ లెటర్ వ్రాసినట్లు మృతుని కుటీంభికులు పేర్కొంటున్నారు.ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. దౌలాపూర్ గ్రామానికి చెందిన తూర్పురాజప్ప(51)గత కొన్ని సంవత్సరాలుగా తాండూరు ఆర్టీసి డిపోలో డ్రైవర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు.గత కొంత కాలంగా రాజప్ప అనారోగ్యంతో బాధపడుతున్నాడు.అనారోగ్యంతో ఉన్న ఆయన పరిస్థితిని గమనించిన డిపో ఉన్నతాధికారులు బస్సు నడిపించే విధుల నుంచి తప్పించి డిపోలోనే ఇతర పనులను అప్పగించారు.ఈ క్రమంలో రాజప్ప ఆరోగ్యం సరిగ్గా లేని కారణంగా డ్యూటీలో కొంత నిర్లక్ష్యం ఉండేది.దీంతో డిపో మేనేజరు,మరో ముగ్గురు అధికారులు మృతున్ని వేధింపులకు గురి చేసేవారని కుటీంభీకులు ఆరోపించారు.తనను ఉన్నతాధికారులు నిత్యం వేధింపులకు గురి చేస్తున్నారని తోటి సిబ్బందికి, కుటీంభికులకు, గ్రామస్తులకు చెబుతూ గోడు వెళ్లవేసేవారని తెలిసింది.వేధింపులు భరించలేక తీవ్ర మనస్థాపానికి గురైన ఆయన మంగళవారం గ్రామ శివారులో చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు.మృతుని బంధువుల పిర్యాదు మేరకు కేసు నమోదు చుసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు యాలాల పోలీసులు తెలిపారు.

**ఆరోపణలు అవాస్తవం : డిపో మేపేజరు**

తాండూరు ఆర్టీసి ఉద్యోగి ఆత్మహత్య చేసుకోవడంలో తమ వేధింపులే కారణమని చేస్తున్న ఆరోపణలు అవాస్తవమని డిపో మేనేజర్ సమత పేర్కొన్నారు.ఆయన ఇటీవల 12 రోజుల పాటు విధులకు హాజరు కాలేదు.అయినా ఆయనపై సంస్థపరమైన ఎలాంటి చర్యలు తీసుకోలేదు.గత మూడు రోజులుగా ఎవరికీ అందుబాటులో లేదు,మా సిబ్బంది సంప్రదించాలని చూసినా ఆయన నుంచి స్పందన లేదు.వ్యక్తిగత కారణాలతో ఆత్మహత్య చేసుకుంటే సంస్థ ఉద్యోగుల మీద ఆరోపణలు చేయడం సమంజసం కాదని ఆమె తీవ్రంగా ఖండించారు.పోలీసులు అన్ని కోణాల నుంచి దర్యాప్తు చేపట్టి ఆత్మహత్యకు కారణాలను వెలికి తీస్తారు.అనవసర ఆరోపణలు చేయరాదన్నారు.మృతునికి సంస్థ నుంచి రావాల్సిన అన్ని అలవెన్సులను త్వరలో అందిస్తామన్నారు.రాజప్ప మృతి పట్ల తీవ్ర సానుబూతిని ప్రకటించారు.సంస్థ ఉద్యోగి బలవన్మరణం పట్ల ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వడం జరిగిందని డిపోమేనేజర్ వివరణ ఇచ్చారు.

# పదకొండైన పత్తాలేని అధికారులు

### -ఇబ్బందులు పడుతున్న ప్రజలు
### -పట్టించుకోని ఉన్నతాధికారులు



తహసీల్దారు కార్యాలయంలో ఖాళిగ ఉన్న కుర్చీలు



తాళం వెసివున్న పశువైద్యకేంద్రం



11గంటలకు తెరుచుకోని రైతువేదిక కార్యాలయం

**జిల్లెడు చౌదరిగూడ, ఏప్రిల్ 30,(ప్రభాతవార్త):**

సరైన సమయంలో కార్యాలయాలకు చేరుకుని ప్రజలకు సేవలందించాల్సిన అధికారులు సమయ పాలన పాటించకపోవడంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. జిల్లెడు చౌదరిగూడ మండలంలోని ప్రభుత్వ కార్యాయాలలో పని చేస్తున్న అధికారులు ఎప్పుడు వస్తారో ఎప్పుడు వెల్లిపోతారో తెలియని పరిస్థితులు దాపరించాయని మండల వాసులు వాపోతున్నారు. మంగళవారం మండల కేంద్రంలోని తహసీల్దారు కార్యాలయంలో అధికారులు 11గంటలకు కూడ రాకపోగా పశువైద్య కేంద్రం, రైతువేదికలు అసలు తాళాలలే తీయలేదు. దీంతో కార్యాలయాలకు ఆయా పనులపై వచ్చిన ప్రజలకు నిరాశే గురైంది. ఇప్పటికైన సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి అధికారులను సమయ పాలన పాటించే విదంగా చూడాలని మండల వాసులు కోరుతున్నారు.

# ఘనంగా రేణుక ఎల్లమ్మ పండుగ

### -కనుల పండువగా కళ్యాణం
### -పూనకాలతో మహిళా భక్తులు, తిలకించి పులకించిన జనం



కూరగాలయ మార్కెట్ నుండి వెళుతున్న పల్లకిసేవ,పూనకాలతో ఊగిపోతున్న మహిళలు

**ఆమనగల్లు, ఏప్రిల్30, ప్రభాతవార్త:** శ్రీశ్రీశ్రీ రేణుక ఎల్లమ్మతల్లి పండుగ మహోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. జిల్లెల లలితమ్మస్వామి జంగయ్యయాదవ్ ఆధ్వర్యంలో ఆమనగల్లు పట్టణం ఉదయ్‌నగర్ కాలనీలోని శ్రీశ్రీశ్రీ రేణుక ఎల్లమ్మ దేవాలయం వద్ద మూడు రోజులపాటు పండుగ నిర్వహించారు. ఈనెల 27న ప్రారంభమైన పండుగ మహోత్సవ వేడుకలు 30వ తారీఖున ముగిశాయి. చివరిరోజు మంగళవారం అమ్మవారి కళ్యాణం నిర్వహించారు. కళ్యాణం తిలకించడానికి భక్తులు పెద్దసంఖ్యలో రేణుక ఎల్లమ్మ దేవాలయానికి తరలివచ్చారు. పట్టణంలోని పురవీధుల గుండా అమ్మవారికి పల్లకిసేవ నిర్వహించారు. పూనకాలతో మహిళా భక్తులు ఊగిపోతూ పల్లకిసేవ దేవాలయానికి చేరుకుంది. పూనకాలతో ఊగిపోతున్న మహిళాభక్తులను చూసేందుకు సాధారణ జనం భారీగా తరలివచ్చారు. డప్పుచప్పుళ్ళు, పూనకాలతో ఊగిపోతున్న భక్తులతో ప్రధాన వీధులు ఆధ్యాత్మికశోభను సంతరించుకున్నాయి. కాగా చివరిరోజు కళ్యాణం, పూజ పటాలు వేయుట, మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం పరుశురాముడు-ఎల్లమ్మ వేషధారణతో లంధకుపోవడం, లంధపూజ చేశారు. అనంతరం పూర్ణాహుతితో పండుగ మహోత్సవ వేడుకలను ఘనంగా ముగించారు.

# రైతులు వరి కొనుగోలు కేంద్రాలను ఉపయోగించుకోవాలి : డిఆర్‌డిఓ శ్రీలత



వరి ధాన్యాన్ని పరిశీలిస్తున్న అధికారులు

**మాడ్గుల,ఏప్రిల్30,ప్రభాతవార్త:-**

మండలంలోని రైతులు వరి కొనుగోలు ఉపయోగించుకుని మద్దతు ధర పోందలని డిఆర్‌డిఓ శ్రీలత అన్నారు.మండలంలోని ఐకెపి అధ్వర్యంలో ఏర్పటు చేసిన కొనుగోలు కేంద్రాని ఎపిడి సుభాషినితో కలసి సందర్శించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు యాసంగిలో సండించిన వరి ధాన్యాన్ని ఆరబెట్టి తేమ,తాలు లేకుండా నిబంధనల ప్రకారం కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి తగిన మద్దతు ధర పొందాలని చూసించారు.క్వింటాలు ధర 2203 సాధారణ రకం2183 ధర నిర్ణయించినట్లు వారు తెలిపారు.రైతులు తమ వెంట పాస్‌పుస్తకం జిరాక్స్‌తో పాటు ఆధార్ కార్డు,బ్యాంక్ పుస్తకం తీసుకురావాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎపిడి సక్రియ నాయక్,ఎంపిడిఓ సరస్వతి,ఏపియం మాచర్ల సర్సిహ,ఏపిఓ నర్సింగ్,సీసీలు యాదయ్య,పోచయ్య ,శ్రీశైలం, రామయ్య,వివోఏలు వెంకటమ్మ,నర్మదా,వరలక్ష్మి రైతులు పాల్గొన్నారు.

# మల్కాజ్‌గిరి ఎంపి అభ్యర్థులకు గుర్తులు కేటాయింపు

### -మేడ్చల్ జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ గౌతమ్

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 30, ప్రభాతవార్త**

మల్కాజ్‌గిరి ఎంపి స్థానానికి పోటీలో ఉన్న 22మంది అభ్యర్థులకు గుర్తులు కేటాయించటం జరిగిందని మేడ్చల్ జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ గౌతమ్ ప్రకటించారు. మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాలోని మల్కాజ్‌గిరి పార్లమెంట్ స్థానానికి పోటీ పడుతున్న 22మంది అభ్యర్థులకు కేటాయించిన గుర్తుల వివరాలు వరుస క్రమంలో ఇలా ఉన్నాయి. 1.అనితారెడ్డి శీలం (బిఎస్‌పి)కు ఏనుగు గుర్తు, 2.ఈటల రాజేందర్ (బిజెపి)కి కమలం గుర్తు, 3.పట్నం సునీతమహేందర్‌రెడ్డి (కాంగ్రెస్), హస్తం గుర్తును, 4.రాగిడి లక్ష్మారెడ్డి (బిఆర్ఎస్) కారు గుర్తును కేటాయించారు. 5.అప్పారావు కొండా (ఆర్ఎస్‌పిపి) ఎయిర్ కండిషన్ గుర్తు, 6.చామకూర రాజయ్య అలియాస్ పిడికిలి రాజు (ఎస్‌జెపిఐ) పౌరులు గుర్తు, 7.జువ్వా ఫణికుమార్ చౌదరి (జెబిఎన్‌పి) టార్చిలైట్ గుర్తు, 8.నర్రా సుఖేందర్‌రెడ్డి (విఆర్‌పి) బ్యాట్ గుర్తు, 9.పెద్దపల్లి సందీప్ (బివైడి) వజ్రం గుర్తు, 10.బోయిన దుర్గాప్రసాద్‌యాదవ్ (డిఎస్‌పి) చెప్పులు గుర్తు, 11.యాదీశ్వర్ నక్క (టిఆర్‌పి) మైక్ గుర్తు కేటాయించారు. 12.కంటె సాయన్న (ఇండి) ఉంగరం గుర్తు, 13.చిరిపిరెడ్డి రమేశ్ (ఇండి) బీరువా గుర్తు, 14.తల్లాడ వెంకటేశ్వర్లు (ఇండి) చపాతి రోలరు గుర్తు, 15.దొంతుల బిక్షపతి (ఇండి) రోడ్ రోలర్ గుర్తు, 16.పెసరికాయల పరీక్షిత్‌రెడ్డి (ఇండి) విజిల్ గుర్తు, 17.బంజపల్లి సుధారాణి (ఇండి) బెలూన్ గుర్తు, 18.భారత సుదర్శన్ (ఇండి) గాజులు గుర్తు, 19.మౌటం సంపత్ (ఇండి) బేబీ వాకర్ గుర్తు, 20.రాజేశ్ మిశ్రా (ఇండి) ఆపిల్ గుర్తు, 21. వైష్ణవి ప్రసాద్ (ఇండి) పిల్లనగ్రోవి గుర్తు, 22.ఆర్.సుబేందర్‌సింగ్ (ఇండి) పండ్ల బుట్ట గుర్తులు కేటాయించారు. ..మల్కాజ్‌గిరి పార్లమెంట్ స్థానానికి పోటీ చేస్తున్న 22మంది అభ్యర్థులకు గుర్తుల కేటాయింపులతో ఇక ప్రచారంను మరింత ముమ్మరంగ చేయనున్నారు. ప్రధాన పార్టీల అభ్యర్థులతో పాటు మిగతా అభ్యర్థులు కూడ గుర్తుల ఖరారుతో ప్రచారం చేసుకోవటానికి సిద్ధమయ్యారు. ఇక ఎన్నికల ప్రచారంకు ప్రణాళికలు రూపొందించుకుంటూ ముందుకు వెళుతున్నారు. మల్కాజ్‌గిరి పార్లమెంట్ స్థానానికి పోటీ చేస్తున్న ప్రధాన పార్టీల అభ్యర్థులు ఇప్పటికే తన ప్రచారాన్ని తీవ్రం చేయటం సభలు, సమావేశాలు, ర్యాలీలు, రోడ్‌షోలు చేస్తూ ప్రజల్లోకి వెళ్లటం జరిగింది. ఇక మే 13న ఎన్నికల (పోలింగ్) జరుగనున్నందున అభ్యర్థులు ప్రచారాన్ని మరింత ముమ్మరంగ చేయనున్నారు. గ్రామాల్లో ఎండల తీవ్రతతో పాటు రాజకీయ వేడి ఆరంభమైందని చెప్పవచ్చు.

## కెటిఆర్ చేసిన వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకోవాలి

**సమైక్యాంధ్ర పరిరక్షణ సమితి డిమాండ్**

సైఫాబాద్, ఏప్రిల్ 30 ప్రభాతవార్త: బిఆర్ఎస్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కెటిఆర్ ఎన్నికల ప్రచారంలో భాగంగా బిజెపి, కాంగ్రెస్ పార్టీలు కేంద్రంలో అధికారంలోకి వస్తే హైదరాబాద్ నగరాన్ని కేంద్ర పాలిత ప్రాంతంగా చేస్తాయని వ్యాఖ్యలు చేయడాన్ని సమైక్యాంధ్ర పరిరక్షణ సమితి పార్టీ తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు మంగళవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సమైక్యాంధ్ర పరిరక్షణ సమితి పార్టీ జాతీయ అధ్యక్షుడు గొంటి కుమార్‌చౌదరియాదవ్ మాట్లాడుతూ కెటిఆర్ తక్షణమే తన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. గత పది సంత్సరాలుగా కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి తెలంగాణ రాష్ట్రానికి చేసింది ఏమిలేదని, పలు రాష్ట్రాలలో ఉన్న కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు, కార్పోరేట్ సంస్థలకు ధారాదత్తం చేస్తున్నాయని, చివరకు రైల్వేను కూడా ప్రైవేటు రంగంలోకి తీసుకువచ్చిందని ఆయన ధ్వజమెత్తారు. ఆదే విధంగా దేశ వ్యాప్తంగా 7 దశాబ్దాలకుపైగా కొనసాగుతున్న ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టి రిజర్వేషన్‌లను ఎత్తివేసి ఆర్ఎస్ఎస్ ఏజెండాను అమలు చేసేందుకు బిజెపి కుట్రలు పన్నుతున్నదని ఆయన ఆరోపించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు బ్రహ్మయ్య, చిట్టిబాబు, లక్ష్మి, శంకర్ ఐలయ్య, సత్యనారాయణ, కుమారి తదితరులు పాల్గొన్నారు.

## సేవ్ ఇండియా కోసం ఇండియా కూటమికి మద్దతు

సైఫాబాద్, ఏప్రిల్ 30 ప్రభాతవార్త: సేవ్ ఇండియా-సేవ్ డెమోక్రసీ అనే నినాదంతో ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎస్సీ, ఎస్సీ, బిసి, మైనార్టి ఫ్రంట్ పిలుపు నిచ్చింది. లేని పక్షంలో దేశ భవిష్యత్తు గాఢాంధకారం అవుతుందని, ప్రజలకు సమానత్వం ఉండదని ఫ్రంట్ ప్రతినిధులు ఆరోపించారు. మంగళవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం లో ఫ్రంట్ ఛైర్మన్ సనాఉల్లాఖాన్, వివిధ సంఘాల ప్రతినిధులు సలీం ఆలీ, ఎస్.ఎస్.తన్వీర్, హైముద్దీన్ షకీల్, సలీంభాషా , వెంకటదాస్ తదితరులు మాట్లాడుతూ బిజెపి అధికారంలోకి వచ్చిన పదేళ్ళ కాలంలో దేశంలో ప్రజాస్వామ్యం కరువైందని, మైనార్టిలకు నిధులు విడుదల చేయడం లేదని, రాజ్యాంగం అమలు జరగడం లేదని ఆరోపించారు. ఈ పరిస్థితుల్లో ఇండియా కూటమి అభ్యర్థులకు ఓట్లు వేసి గెలిపించాలని వారు పిలుపునిచ్చారు. దేశంలో అత్యధిక జనాభ కలిగిన ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టిలు ఇండియా కూటమిని గెలిపిస్తే దేశంలో ప్రజాస్వామ్యం అమలు కొనసాగుతుందని, అందుకే కూటమికి మద్దతు ఇస్తున్నామని వారు స్పష్టం చేశారు.

## ఘనంగా నాగదేవత అమ్మవారి అష్టమ వార్షికోత్సవం



వివేకానందనగర్ కాలనీ, ఏప్రిల్ 30, ప్రభాతవార్త 30, ప్రభాతవార్త : వివేకానంద నగర్ డివిజన్ పరిధిలోని చైతన్య నగర్, సుమిత్రనగర్‌లో గల శ్రీశ్రీశ్రీ నాగదేవత అమ్మవారి వార్షికోత్స వం కార్యక్రమంలో మాజీ కార్పోరేటర్ మాధవరం రంగారావుతో కలిసి శేరిలింగంపల్లి శాసనస భ్యులు అరికెపూడి గాంధీ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జరిగిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు అన్నప్రసాదాలు వడ్డించారు. ఈ కార్యక్రమంలో వివేకానందనగర్ డివిజన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు సంజీవరెడ్డి, గొట్టిముక్కల పెద్ద భాస్కర్‌రావు, నాయినేనీ చంద్రకాంత్‌రావు, అల్లం మహేష్, ఆలయ కమిటీ సభ్యులు నర్సయ్య, బాలరాజు, నర్సిం హాచారి, కృష్ణంరాజు, యాదగిరి, వేణు, సత్యనారాయణ, ఉమాపతి, అనిల్‌కుమార్, మల్లేష్, నవీన్ చారి, బాలకృష్ణ, అనిల్ కుమార్, రమేష్, శ్యామ్, లక్ష్మణ్, నరేందర్, ప్రభు, శ్రీహరి పాల్గొన్నారు.

## పదవీ విరమణ చేసిన ఉద్యోగులను స్ఫూర్తిగా తీసుకోవాలి



పదవీ విరమణ చేస్తున్న కండక్టర్ సామెల్‌ను సనన్మానిస్తున్న డిఎం శ్రీధర్

**రాణిగంజ్ డిపో మేనేజర్ శ్రీధర్**

కంటోన్మెంట్, ఏప్రిల్ 30 ప్రభాత వార్త: ఆర్టీసి సంస్థలో 30 సంవత్సరాల నుంచి క్రమశిక్షణతో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగుల సేవలను స్ఫూర్తిగా తీసుకొని తోటి ఉద్యోగులు సంస్థ మనుగడ కోసం పాటుపడాలని రాణిగంజ్ డిపో మేనే జర్ శ్రీధర్ తెలిపారు. మంగళ వారం రాణిగంజ్ డిపోలో పదవీ విరమణ చేసిన ఏడిసీలు నారాయణ, ఖలీల్,కండక్టర్లు జి.సామెల్, ఇమ్మా నియల్, మెకానిక్ రాంమోహన్ లు పదవీ విరమణ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎఫ్.జ్ఞానేశ్వర్, అసిస్టెంట్ మేనేజర్ ట్రాఫిక్ శ్వేతలతో పాటు తోటి ఉద్యోగులు పదవీ విరమణ చేసిన ఉద్యోగుల ను పూలమాలలతో ఘనంగా సత్కరించారు.

**కంటోన్మెంట్ డిపోలో..** కంటోన్మెంట్‌లో డిపోలో ఆర్టీసి ఉద్యోగులుగా పనిచేసిన ఉద్యోగులను మంగళవారం డిపో మనేజర్ ఎల్.రాంమోహనన్ ఘనంగా సత్కరించారుక. పదవీ విరమణ చేసిన కండక్టర్లు శివనారాయణ, హమీద్, శ్రీనివాస్, మెకానిక్ డేవిడ్, హెల్పర్ కనకరాజులు మంగళ వారం పదవీ విరమణ చేశారు.

## ఓటుకు నోటుతో పార్టీలు అందలమెక్కుతున్నాయి

**ఆల్‌ఇండియా బ్యాక్‌వర్డ్‌క్లాస్ సునామీ పార్టీ అధ్యక్షులు సిహెచ్ భూపాల్‌గౌడ్**

హైదరాబాద్, ఏప్రిల్ 30, ప్రభాతవార్త: నోటుతో ఓట్లను కొని అన్ని రాజకీయపార్టీలు అందలమెక్కుతున్నాయని ఆల్‌ఇండియా బ్యాక్‌వర్డ్‌క్లాస్ సునామీ పార్టీ అధ్యక్షులు సిహెచ్ భూపాల్‌గౌడ్ ఆరోపించారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత 75 సంవత్సరాలుగా దేశంలో ఇలాంటి పరిస్థితి నెలకొందని, విచ్చవిడిగా డబ్బులు ఖర్చుపెట్టి అధికారంలోకి వస్తున్నారన్నారు. ఏప్రభుత్వంలో కూడా ప్రజల సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరించలేకపోయిందన్నారు. దేశాన్ని అత్యధిక సమయం పాలించిన కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి శూన్యమని ,బిసిలను అసలు పెట్టించుకోలేదన్నారు. దేశంలో ఆపార్టీ ఎంత మందికి బిసి ముఖ్యమంత్రి పదవులు ఇచ్చిందో చెప్పాలన్నారు. అగ్రకులాలంటే కాంగ్రెస్‌పార్టీకి మక్కువని ,బిసిలను దగ్గరకు కూడా రానివ్వదన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలోనూ ఇదే పరిస్థితులు నెలకొన్నాయని ,కాంగ్రెస్‌కు ఎందుకు ఓటువేయాలో బిసిలు ఆలోచించుకోవాలన్నారు. 52శాతానికి పైగా ఉన్న బిసిలను విస్మరించిన ఆపార్టీని ఈఎన్నికల్లో ఓడగొట్టాలన్నారు. ఈఎన్నికల్లో తాను సికింద్రాబాద్ పార్లమెంట్ స్థానం నుంచి పోటీ చేస్తున్నానని బిసిలందరూ ఆదరించాలని కోరారు.



మట్‌పోర్ట్‌లో డప్పులతో ప్రచారం చేస్తున్న ఎమ్మార్పీఎస్ నేతలు

## మాదిగలంతా బిజెపి వైపే

**ఇటుక శ్రీ కిషన్ మాదిగ**

కంటోన్మెంట్, ఏప్రిల్ 30 ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్రం లో మాదిగలంతా బిజెపివైపే మొగ్గుచూపుతున్నారని కంటోన్మెంట్ ఎమ్మార్పీఎస్ ఇన్‌ఛార్జి ఇటుక శ్రీ కిషన్ మాదిగ తెలిపారు. మంగళవారం కంటోన్మెంట్ 3వ వార్డులోని అంబేద్కర్ నగర్, అన్నా నగర్, ఉత్తరయ్య బస్తీ, పరిసర ప్రాంతాల్లో డప్పులతో ప్రచారం నిర్వహిస్తూ బిజెపి అభ్యర్థులు ఈటెల రాజేందర్, అసెంబ్లీ అభ్యర్థి డాక్టర్ వంశా తిలక్‌లను గెలిపించేందుకు కమలం గుర్తుకు ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నేతలు అజిత్ కళ్యాణ్, రొట్టెల సునీల్ మాదిగ పాల్గొన్నారు.

## డిఫెన్స్ అకౌండ్స్ డిపార్ట్‌మెంట్ సీనియర్ ఆడిటర్ పదవీ విరమణ




పదవీ విరమణ మహోత్సవంలో స్వామి దంపతులు

అల్వాల్, ఏప్రిల్ 30 ప్రభాతవార్త: డిఫెన్స్ అకౌంట్స్ డిపార్ట్‌మెంట్(డిఎడి) సీనియర్ ఆడిటర్ దిడ్ల స్వామి మంగళవారం పదవీ విరమణ చేశారు. సికింద్రాబాద్ విభాగంలో జరిగిన పదవీ విరమణ మహోత్సవంలో సీనియర్ అధికారులు, సిబ్బంది దిడ్ల స్వామిని ఘనంగా సన్మానించడం జరిగింది. 33 సంవత్సరాలు పాటు డిఫెన్స్ అకౌంట్స్ విభాగంలో ఆయన బాధ్యతలు నిర్వర్తిం చారు. స్వామి చేసిన సేవలకు గాను అనేక అవార్డలు పొందారు. పదవీ విరమణ కార్యక్రమంలో పాల్గొన్న సీనియర్ అడిటర్‌లు రాజిరెడ్డి, ధనలక్ష్మి, వెంకటరావు, వెంకట రమణలు స్వామి సేవలను కొనియాడారు. కార్పొరేటర్‌లు జితేందర్‌నాథ్, ప్రేమ్‌కుమార్ అభినందించారు.

## బీఎంఈయూకు మూకుమ్మడి రాజీనామాలు



ఉపాధ్యక్షులు అమరేశ్వర్

హైదరాబాద్, ఏప్రిల్ 30, ప్రభాతవార్త: భాగ్యనగర్ మున్సిపల్ ఎంప్లాయీస్ యూనియన్‌కు నేతలు మూకుమ్మడిగా రాజీనామాలు చేశారు. ఈమేరకు ఉపాధ్యక్షులు అమరేశ్వర్, వర్కింగ్ ప్రెసిడెంట్ నందకిశోర్ ఒక ప్రకటన విడుదల చేస్తూ గ్రేటర్ హైదరాబాద్‌లోని కోటిన్నర మందికి సేవలందించే జీహెచ్ఎంసీలోని ఉద్యోగ కార్మిక సంఘాల ఉనికి రోజు రోజుకూ ప్రశ్నార్థకంగా మారుతోం దని ఆందోళన వ్యక్తం చేశారు. కొన్ని సంవత్సరాల వరకు గుర్తింపు పొందిన యూనియన్‌గా కొనసాగిన భాగ్యనగర్ మున్సిపల్ ఎంప్లాంయూస్ యూనియన్ నేడు తన ఉనికిని కోల్పోతోందని, దీనికి కారణం యూనియన్ నేత శంకర్ వ్యవహారశైలేనని ఆరోపించారు. ఆయన వ్యవహారశైలి నచ్చకనే యూనియన్ నుండి ప్రధాన కీలక నేతలైన తాము మరియు ఇతర నేతలు శ్రీనివాస్, దిలీప్‌కుమార్, నర్సింగ్‌రావు తదితరులు బయటకు రావటం జరిగిందని, రాజీనామా పత్రాన్ని కూడా యూనియన్ అధ్యక్షునికి ఇవ్వటం జరిగిందని తెలిపారు.

## బాధ్యతకు మారుపేరుగా ప్రజలకు జవాబుదారీతనం

**జిహెచ్ఎంసి ఎస్ఇ చిన్నారెడ్డి**

కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 30 ప్రభాతవార్త: ప్రభుత్వ ఉద్యోగమంటేనే బాధ్యతతో కూడిన జవాబుదారీతనమని గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఇంజనీరింగ్ ఎస్ఇ చిన్నారెడ్డి అన్నారు. గాజులరామారం సర్కిల్ ఇంజనీరింగ్ విభాగంలో హెచ్‌డిగా పనిచేసిన కె.బద్రేశ్వర్ రావు పదవీ విరమణ సందర్భంగా గాజులరామారం సర్కిల్ సమావేశపు హాలులో నిర్వహించిన సన్మాన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా కుత్బుల్లాపూర్ ఎక్జిక్యూటీవ్ ఇంజనీర్ కృష్ణచైతన్య, గాజులరామారం ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ కిష్టప్ప, మూసాపేట్ ఇ.ఇ. గోవర్ధన్‌గౌడ్‌లతోఆటు డి.ఇ.లు రూపాదేవి, పాపమ్మ, ఎ.ఇ.లు మల్లారెడ్డి, కళ్యాణ్, సంపత్, తిరుపతి, దీపిక, సురేందర్‌నాయక్, సురజ్, దాసరి వెంకటేశ్, పాల్గొన్నారు. ఈసందర్భంగా చిన్నారెడ్డి మాట్లాడుతూ పదవీ విరమణ వయస్సు గతంలో 58ఉండగా గత ప్రభుత్వం దానికి 61కి మార్చి మరోమూడేళ్ల పెంచడం ద్వారా ప్రతి ఉద్యోగికి ఉపయోగపడిందన్నారు. పదవీ విరమణ చేసిన (హెచ్‌డి) బద్రేశ్వర్ మాట్లాడుతూ గత 40 ఏళ్లుగా అందరికీ సమాన ప్రాధాన్యత నిస్తూ ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రత్యేక శ్రద్ధ తీసుకునట్లు తెలిపారు. 1984నుండి



ఇంజనీరింగ్ హెచ్‌డి(డిఇ) బద్రేశ్వర్ పదవీ విరమణ సందర్భంగా కుత్బుల్లాపూర్ సర్కిల్ సమావేశ మందిరంలో పాల్గొన్న కూకట్‌పల్లి ఎస్ఇ చిన్నారెడ్డి, ఇ.ఇ.లు కృష్ణచైతన్య, కిష్టప్ప, గోవర్ధన్‌గౌడ్

2024వరకు ఉద్యోగ బాధ్యతలతో తనకు సహకరించిన ప్రతిఒక్కరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు. ఈసందర్భం గా గాజుల రామారం, కుత్బుల్లాపూర్ సర్కిల్ కాంట్రాక్టర్స్ అసోసి యేషన్ అధ్యక్షులు వేముల సురేశ్, అసోసియేషన్ ప్రతినిధులు గణేష్, సాయిబాబా, ఇ.వెంకటేశ్, శ్రావణ్, అశోక్, దేవరాజ్, గిరిబాబు పాల్గొన్నారు.

## క్రీడలలో గెలుపు ఓటమిలను సమానంగా స్వీకరించాలి: కె.ఎం.గౌరీష్



చింతల్ పల్లవి ఇంటర్‌నేషన్ స్కూల్‌లో రన్నర్లుగా నిలిచిన విద్యార్థులకు మెమెంటోలు అందజేస్తున్న పాఠశాల చైర్మెన్ కె.ఎం.గౌరీష్ , పాఠశాల ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు

కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 30 ప్రభాతవార్త : ప్రపంచంలో ఏరంగంలో లోని స్ఫూర్తి కేవలం క్రీడలలోనే వుందని, గెలుపు ఓటమిలను సమానంగా స్వీకరించే శక్తి కేవలం క్రీడా కారులకే సాధ్యమని చింతల్ పల్లవి ఇంటర్‌నేషన్ స్కూల్ చైర్మెన్ కె.ఎం.గౌరీష్ అన్నారు. స్కూల్ స్పోర్ట్స్, కల్చరల్ ఆక్టివిటీస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో నిర్వహించిన క్రికెట్ పోటీలలో కెఎంజి క్రికెట్ టోర్నమెంట్ విద్యార్థులు రన్నర్లుగా నిలిచారు. ఈసందర్భంగా మంగళవారం పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో ఆయన చేతుల మీదుగా రన్నర్లుగా నిలిచిన విద్యార్థులకు మెమెంటోలు అందజేశారు. ఈ సందర్భంగా కె.ఎం.గౌరీష్ మాట్లాడుతూ నిరంతరం లక్షసాధన దిశగా శ్రమిస్తూనే ఎలాంటి ఫలితాన్నయినా సమానంగా స్వీకరించేందుకు విద్యార్థులు సిద్ధపడాలన్నారు. బాల్యదశ నుండే క్రీడాస్ఫూర్తిని ప్రతి విద్యార్థికి ఇటు ఉపాధ్యాయులు, అటు తల్లిదండ్రులు ప్రత్యేకశ్రద్ధలో అలవాటు చేస్తే వారు అన్ని రంగాలలో సమానంగా రాణించడంతో పాటు ఉత్తమ ప్రతిభ కనబరిచే అవకాశం వుంటుందన్నారు.

## మేడే సందర్భంగా వాడవాడలా ఎర్రజెండాలు ఎగురవేయండి

**ఏఐటీయూసీ కౌన్సిల్ సభ్యులు శ్రీనివాస్**




గోడ పత్రికను ఆవిష్కరిస్తున్న పాలబిందెల శ్రీనివాస్

నిజాంపేట్, ఏప్రిల్ 30 ప్రభాతవార్త : నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి లోని నిజాంపేట్ వార్డు కార్యాలయం వద్ద 138వ ప్రపంచ కార్మికుల దినోత్సవం సందర్భంగా మంగళవారం ఏఐటియూసీ నిజాంపేట్ అధ్యక్షులు ఆశి యాదయ్య ఆధ్వర్యంలో వాల్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏఐటియూసీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పాలబిందెల శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1886లో పని భద్రత, పనిగంటలు తగ్గింపు కొరకై పోరాటాలు చేసి అసువులు బాసిన చికాగో అమరవీరుల ఆశయ సాధన కొరకై పోరాడాలని పిలుపునిచ్చారు. కార్మిక చట్టాలు కార్మిక హక్కులు హరిస్తున్న కేంద్ర ప్రభుత్వ విధానాలు తిప్పికొట్టాలని విజ్ఞప్తి చేశారు. కనీస వేతనాలు పని భద్రత, ఇఎస్ఐ, పీఎఫ్, కార్మికులకు సమగ్ర చట్టం, మున్సిపల్ కార్పొరేషన్ కార్మికులకు 24వేల జీతం, ఉద్యోగులందరినీ రెగ్యులరైజ్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దుర్గయ్య, జితయ్య, కృష్ణ, భాగ్యమ్మ, నర్సమ్మ, అమృత, యాదమ్మ, సత్తమ్మ, శంకర్, వెంకన్న, నాగయ్య పాల్గొన్నారు.



నగరంలో పర్యటించిన ఆస్ట్రేలియా క్రికెటర్ కమిన్స్



హేమంత్ (పాతచిత్రం)

## అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతి

సంజీవరెడ్డి నగర్, ఏప్రిల్ 30 ప్రభాతవార్త: ఎసార్ నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇన్‌స్పెక్టర్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం జడ్చర్ల గ్రామానికి చెందిన హేమంత్ (28), తండ్రి నారాయణ వృత్తి రీత్యా వ్యాపారి, అదే గ్రామానికి చెందిన ఓ అమ్మాయితో గత కొద్ది రోజులుగా ప్రేమించుకుంటున్నారు. సోమవారం నాడు హైదరాబాద్‌లో ఓ పంక్షన్‌కి ఇద్దరు హాజరై తరువాత ఎస్ఆర్ నగర్‌లో ఓయో హోటల్‌లో రూమ్ తీసుకొని రాత్రికి అక్కడే గడిపారు. గడిపిన సమయంలో హేమంత్ మద్యం సేవించి ఇరువురు బోజనం చేశారు. అనంతరం సుమారు రెండుగంటల ప్రాంతంలో హేమంత్ బాత్ రూమ్ వెళ్లి ఎంతసేపటికి రాకపోవడంతో ఆ అమ్మాయి బాత్‌రూమ్‌లోకి వెళ్లి చూడగా అపస్మారక స్థితిలో హేమంత్ ఉన్నాడు. వెంటనే అతని స్నేహితులకు ఫోన్ ద్వారా సమాచారం ఇవ్వగా వారు వచ్చి హేమంత్‌ను మంచంపై పడుకోబెట్టి అంబులెన్స్‌కు ఫోన్ చేయగా వారు వచ్చి పరీక్షించి హేమంత్ చనిపోయాడని నిర్ధారించారు. ఈ విషయం గురించి హేమంత్ తల్లి హేమలతకు తెలుపగా తన కుమారుడు ఎలా మరణించాడు అనే విషయంపై స్పష్టత కావాలని ఎస్ఆర్.నగర్ పోలీసులను ఆశ్రయించింది. ఈ మేరకు ఎస్ఆర్ నగర్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

### న్యాయ విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

చిక్కడపల్లి, ఏప్రిల్ 30 ప్రభాతవార్త: న్యాయ విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవడంతో పాటు ప్రతి అంశంపై పట్టు సాధించాలని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విద్యాసంస్థల కరస్పాండెంట్ జి.సరోజా వివేక్ అన్నారు. మంగళవారం బాగ్‌లింగంపల్లి డాక్టర్ బిఆర్.అంబేద్కర్ న్యాయ కళాశాల 5వైడీసీ, 3వైడీసీ విద్యార్థులకు వీడ్కోల సభ జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన సరోజా వివేక్ మాట్లాడుతూ డాక్టర్ బిఆర్.అంబేద్కర్ న్యాయ కళాశాల నుంచి ఎంతో మంది న్యాయమూర్తులుగా, న్యాయవాదులుగా తయారు చేసిన ఘనత కూడా ఉందన్నారు. న్యాయ విద్యార్థులు సమాజహితం కోసం పేదలకు న్యాయం అందించే విధంగా కృషి చేయాలన్నారు.

## కంటోన్మెంట్‌ను జిహెచ్ఎంసీలో విలీనం చేస్తేనే అభివృద్ధి : వికాస్ మంచ్



కాంగ్రెస్‌లో చేరిన పార్టీలో కంటోన్మెంట్ వికాస్ మంచ్ సంస్థ ప్రతినిధులు

కంటోన్మెంట్, ఏప్రిల్ 30 ప్రభాతవార్త: కేంద్రప్రభుత్వ ఆధీనంలో ఉన్న కంటోన్మెంట్‌ను జిహెచ్ఎంసీలో విలీనం చేస్తేనే అభివృద్ధి జరుగుతుందని, అందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సానుకూలంగా ఉన్నందుకు ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి సంపూర్ణ మద్ధతు తెలుపుతున్నామని వికాస్ మంచ్ సంస్థ అధ్యక్షులు గడ్డం ఏబేలు, ప్రధాన కార్యదర్శి సంకి రవిందర్ బాబులు తెలిపారు. మంగళవారం వికాస్ మంచ్ ప్రతినిధులు కంటోన్మెంట్ కాంగ్రెస్ ఎన్నికల ఇన్‌ఛార్జి మారబోయిన రఘునాథ్ యాదవ్, కంటోన్మెంట్ అసెంబ్లీ కాంగ్రెస్ అభ్యర్థి ఎన్.శ్రీగణేష్‌ల సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ నసందర్భంగా రఘునాథ్ యాదవ్ మాట్లాడుతూ మల్కాజిగిరి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి పట్నం సునీతా రెడ్డి, అసెంబ్లీ అభ్యర్థి శ్రీగణేష్‌లను బారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపిస్తేనే అభివృద్ధితో పాటు రాష్ట్ర ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవచ్చ న్నారు. ఈ కార్యక్రమంలో వికాఃస్ మంచ్ ప్రతినిధులు అంబాల శ్రీను, ప్రభుగుప్త, రామడుగు దామోదర్, గిరి, జి.వి.రమేశ్, జమీల్, కాంగ్రెస్ నాయకులు రంగ రవిందర్ గుప్త, శ్యామ్‌సనత్ రాజ్, అరుణ్ యాదవ్, కనుకుల యుగంధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పార్లమెంట్‌లో బిసి బిల్లు ప్రవేశపెట్టాలి

**7న రాష్ట్ర స్థాయి విస్తృత సమావేశం**

**రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య ప్రకటన**

సైఫాబాద్, ఏప్రిల్ 30 ప్రభాతవార్త: పార్లమెంట్‌లో బిసి బిల్లు ప్రవేశపెట్టి చట్ట సభలలో 50 శాతం రిజర్వేషన్‌లు కల్పించాలని, కులగణన చేసి బిసిలకు విద్యా, ఉద్యోగ, స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిల రిజర్వేషన్‌లను 25 నుంచి 50 శాతంకు పెంచాలని డిమాండ్ చేస్తూ మే 7వ తేదీన రాష్ట్ర స్థాయి విస్తృత సమావేశం నిర్వహిస్తున్నామని జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య తెలిపారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 76 సంవత్సరాలు గడిచిన మన దేశంలో ఇంకా పేద బిసి కులాలకు అన్ని రంగాలలో సమాన వాటా లభించలేదని ఆవేదన వ్యక్తం చేశారు.దేశంలో ప్రపంచ బ్యాంక్ సర్వే ప్రకారం 49 శాతం జనాభ పేదరికం కింద జీవిస్తున్నాయని 29 మంది ప్రజలు నిరక్షరాస్యులుగా ఉన్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రపంచంలో అన్ని దేశాలు శరవేగంతో అభివృద్ధి చెందుతున్నాయని, మన దేశంలో పేదరికం, నిరక్షరాస్యత అమాయకత్వంతో ప్రజలు నలిగిపోతున్నారని, కేంద్రంలో ఆనేక ప్రభుత్వాలు మారుతున్నప్పటికి బిసిలు వాటా బిసిలకు లభించడం లేదన్నారు. ఇది ప్రపంచంలో అత్యంత ప్రజాస్వామ్య దేశామని బిసిలు బిచ్చగాళ్ళు కాదని, వాటాదారులని, వీరి వాటా ఇవ్వకపోతే తిరుగుబాటు తప్పదని ఆర్.కృష్ణయ్య హెచ్చరించారు. భరత మాత ముద్దుబిడ్డలైతే సమన్యాయం పాటించాలని, బిసిలకు అన్యాయం చేస్తే సహించేది లేదన్నారు. ఇప్పటికైనబిజెపి బిసిలకు సమన్యాయం చేయాలని చట్టసభలలో బిసిలకు 50 శాతం రిజర్వేషన్‌లు కల్పిస్తామని ప్రకటించాలని డిమాండ్ చేశారు.కేంద్రంలో బిసిలకు ప్రత్యేకంగా మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని, ఖాళీగా ఉన్న 16 లక్షల ఉద్యోగాలను భర్తీ చేయాలని, బిజెపిలో ఉన్న బిసి నాయకులు కేంద్రంపై వత్తిడి చేయాలని ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు.

## దిద్దుబాటు చర్యలు చేపట్టిన ఒయూ అధికారులు

తార్నాక, ఏప్రిల్ 30 ప్రభాతవార్త : ఓ.యూలో మంచినీటి కొరత, విద్యుత్ అంతరాయం నోటీసుపై ఓ.యూ అధికారులు దిద్దుబాటు చర్యలు చేపట్టారు. ఈ విషయంలో మాజీ సీఎం కేసీఆర్ స్పందించి, రాష్ట్రంలో నీరు,విద్యుత్ కొరత ఉందనేందుకు ఇదే సాక్ష్యం అని సోషల్ మీడియాలో పేర్కొనడంతో పాటు ఖమ్మం సభలో కూడా ఈ విషయాన్ని మాట్లాడిన సంగతి తెలిసిందే. దీంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు హాస్టళ్ల తెరిచే ఉంటాయని ప్రకటిస్తూ రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మినారాయణ ఉత్తర్వ్యాలు జారీ చేశారు. కాని మెస్‌ల విషయంలో ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు. సాధారణ విద్యా సంవత్సరం ప్రకార మే 1వ తేదీ నుంచి 31 వరకు వేసవి సెలవులను ముందుగానే నిర్ణయించామని పేర్కొన్నారు. వివిధ పోటీ పరీక్షలకు సన్నద్దమయ్యేందుకు వేసవి సెలవులు ఉపయోగించుకుంటామని, హాస్టల్స్‌ను మూసి వేయకూడదంటూ ఇటీవల కొంత మంది విధ్యార్థుల బృందం నుంచి తమకు వినతులు వచ్చాయని రిజిస్ట్రార్ పేర్కొన్నారు. వారి విజ్ఞప్తి మేరకు వేసవి సెలవుల్లో కూడా హాస్టల్స్‌ను తెరిచి ఉంచుతున్నామని వెల్లడించారు. వేసవిలో క్యాంపస్‌లో ఉండాలను కునే విద్యార్థుల నిర్ణయం వారికి ఎంతో దోహదపడుతుందన్నారు.

**సీఎం రేవంత్ రెడ్డి సర్క్యులేట్ చేసేది ముమ్మాటికి ఫేకే : ఒయూ విద్యార్థి నేతలు**

గతేడాది సెలవులు జారీ చేసిన సర్క్యులర్ సీఎం రేవంత్ రెడ్డి సోషల్ మీడియాల్లో ఉంచింది ముమ్మాటికి ఫేకేనని కొందరు బీఆర్ఎస్ విద్యార్థినేతలు ఆరోపించారు. గతేడాది హాస్టళ్లలో ఉన్నప్పుడు జారీ చేసిన సర్క్యులరే నిజమైందని, దానినే బహిర్గతం అయ్యిందన్నారు. అవసరమైతే సర్క్యులర్ అసలైందా.. కాదా అనేదానికి అవసరమైన పరీక్షలు చేయాలని డిమాండ్ చేశారు. గతేడాది ఓ.యూ హాస్టల్స్ మే 12 నుంచి జూన్ 5వ తేది వరకు మెస్‌లను మాత్రమే మూసివేశారని వారు గుర్తు చేశారు. కరెంటు, నీళ్లకు ఎటువంటి ఇబ్బంది లేకుండా హాస్టల్స్‌కు సరఫరా చేశారని చెప్పారు. సీఎం రేవంత్ రెడ్డి నిజాన్ని అంగీకరించి కరెంటు, నీటిని అందించి ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని పేర్కొన్నారు.

## సాహిత్యంలో అనేక ప్రక్రియల్ని స్పృశించిన సాహితీవేత్త మహాకవి రామకృష్ణమాచార్య

**తెలంగాణ జనాభా లెక్కలశాఖ ఉపసంచాలకురాలు జి.వసుంధర**

రవీంద్రభారతి, ఏప్రిల్ 30 ప్రభాతవార్త : తెలుగు సాహిత్యరంగంలో అనేక ప్రక్రియలను స్పృశించిన గొప్ప సాహితీవేత్త మహాకవి డా. నందూరి రామకృష్ణమాచార్య అని తెలంగాణ రాష్ట్ర జనాభా లెక్కలశాఖ ఉప సంచాలకురాలు జి.వసుంధర అన్నారు. నందూరి రామకృష్ణమాచార్య సాహిత్యపీఠం, నవ్య సాహితీసమితి సంయుక్త ఆధ్వర్యంలో శ్రీకృష్ణదేవరాయ తెలుగు భాషానిలయంలోని డా. రావిచెట్టు రంగారావు కళావేదికలో ప్రముఖ సాహితీవేత్త ఆచార్య టి.గౌరిశంకర్ సభాధ్యక్షతన జరిగిన మహాకవి డా. నందూరి రామకృష్ణమాచార్య 104వ జయంతి సభకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన జి.వసుంధర విశిష్ట అతిథులు మాడభూషి శ్రీధర్, కె.సాగరరావు, డా. ఆచార్య ఫణీంద్ర, ఎం.లక్ష్మీ మానస తదితరులతో కలిసి ప్రముఖ రచయిత, ఆధ్యాత్మిక ప్రవచనకర్త వి.ఎస్.ఆర్. మూర్తిని ఘనంగా సత్కరించి నందూరి రామకృష్ణమాచార్య స్మారక పురస్కారం ప్రదానం చేసి నందూరి స్ఫూర్తితో మన సాహితీ సంపదను భావితరాలకు అందించాలని కోరారు. సభకు ఎం.లక్ష్మీమానస స్వాగతం పలుకగా మధుమతి, సత్యవాణి, సుధామాల సభాసమన్వయం కావించారు. చివరిగా డా. రామకృష్ణమాచార్యపై కవి సమ్మేళనం నిర్వహించారు.




విఎస్ఆర్.మూర్తికి నందూరి రామకృష్ణమాచార్య స్మారక సాహిత్య పురస్కారాన్ని ప్రదానం చేస్తున్న వసుంధర, గౌరీశంకర్, శ్రీధర్, లక్ష్మీమానస తదితర అతిథులు

## పదవ తరగతి ఫలితాల్లో 99శాతం ఉత్తీర్ణత సాధించిన చేవేళ్ల గురుకుల బాలికల పాఠశాల విద్యార్థులు

**మొయినాబాద్ ఏప్రిల్30,ప్రభాతవార్త :**
రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించినటువంటి పదవ తరగతి పరీక్షల్లో మొయినాబాద్ మండలంలోని తోలుకట్ట గ్రామ రెవెన్యూలో ఉన్నటువంటి చేవేళ్ల గురుకుల స్వేచ్ఛ బాలికల పాఠశాల 10వ తరగతి విద్యార్థులు 99శాతం ఉత్తీర్ణత సాధించాలని పాఠశాల ప్రిన్సిపాల్ రమాదేవి ఓ ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా వారు వార్త పత్రికతో మాట్లాడుతూ....బాలికలు చక్కటి ఫలితాలు తీసుకొచ్చారని పాఠశాలకు మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకొచ్చా రని వారిని ప్రత్యేకంగా అభినందించారు.ఉత్తమ పలితాలను సాధించి తెలు గులో 98శాతం హింది ఆంగ్లం గణితం సామాన్య శాస్త్ర ,సాంఘిక శాస్త్రం లో 100 శాతం విద్యార్థులు పాస్ కావడం జరిగింది.అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన వారు ఈ వైష్ణవి 9.7ఎం.శ్రీలత,9.5 వర్షని,9.3 శృతి,9.3 హెచ్.స్వాతి, 9.2 వైష్ణవి,9.2 దీపిక,9.0 రేవతి,9.0 హారిక,9.0 వైస్‌పూర్తి కె హరిత 9.0 నిహారిక 8.8 గ్రేడ్ పాయింట్లను సాధించారు.పశ్చిమ ప్రాంతీయ సమన్వయ అధికారి డాక్టర్ సాదా వెంకటేష్ ఫోన్ చేసి విద్యా ర్థులను ప్రత్యేకంగా ప్రిన్సి పాల్‌ను అధ్యాపకులను ప్రత్యేకంగా అభినందించారు.

## నాగన్‌పల్లి,పోచారం పాఠశాలల్లో వందశాతం ఉతీర్ణత

**ఇబ్రహీంపట్నం ఏప్రిల్30,ప్రభాతవార్త :**
ఇబ్రహీంపట్నం మండలంలో ప్రభుత్వ పాఠశాలల్లో పదవ తరగతిలో 90.3శాతం విద్యార్థులు ఉతీర్ణత సాధించారు.మొత్తం 16 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పదవ తరగతిలో రెండు పాఠశాలలు నాగన్‌పల్లి గ్రామంలోని రామోజీ ఫౌండేషన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల అలాగే పోచారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వందశాతం విద్యార్థులు ఉతీర్ణత సాధించారు. మండలంలో మొత్తం 658 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 594 మంది విద్యార్థులు ఉతీర్ణులైనట్లు ఎంఈఓ వెంకట్ రెడ్డి వెల్లడించారు.

## శ్రీరేణుకా ఎల్లమ్మ ఆలయంలో అన్నదానం


శామీర్‌పేటలోని శ్రీరేణుకా ఎల్లమ్మ ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమం జరిగిన దృశ్యం

**శామీర్‌పేట, ఏప్రిల్ 30, ప్రభాతవార్త**
శామీర్‌పేటలోని శ్రీ రేణుకా ఎల్లమ్మ ఆలయం వద్ద మంగళవారం ప్రత్యేక పూజలు, ఆ తరువాత అన్నదాన కార్యక్రమం జరిగింది. మంగళవారం శామీర్‌పేటలోని శ్రీరేణుకా ఎల్లమ్మ ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆ తరువాత అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. భారీ సంఖ్యలో భక్తులు విచ్చేసి పూజా కార్యక్రమంలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. శ్రీ రేణుకా ఎల్లమ్మ ఆలయం తరపున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనిలో శామీర్‌పేట గ్రామం వారితో పాటు వివిధ గ్రామాల భక్తులు, పలువురు ప్రజాప్రతినిధులు, మాజీలు, రాజీవ్‌రహదారిన వెళ్లే భక్తులు అమ్మవారి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు.

## పంట పొలాలను పరిశీలించిన బిఆర్ఎస్ నాయకులు

**-పోస్టుకార్డుల ప్రదర్శన..సిఎం కార్యాలయంకు రైతుల ఉత్తరాలు**


నారాయణపూర్ గ్రామ పరిధిలోని వరి పంటలను సందర్శించి పరిశీలించిన డిసిఎంఎస్ వైస్‌చైర్మన్ ఆర్.మధుకర్‌రెడ్డి, మండల బిఆర్ఎస్ నాయకుల దృశ్యం

**శామీర్‌పేట, ఏప్రిల్ 30, ప్రభాతవార్త**
నారాయణపూర్ గ్రామంలో వరి పంట పొలాలను డిసిఎంఎస్ వైస్‌చైర్మన్ ఆర్.మధుకర్‌రెడ్డి, పలువురు మండల బిఆర్ఎస్ నాయకులు సందర్శించారు. మంగళవారం మూడుచింతలపల్లి మండలంలోని నారాయణపూర్ గ్రామంలోని రైతులు పండిస్తున్న వరి పంట పొలాలను వారు సందర్శించి పరిశీలించారు. పంటలకు విద్యుత్ సమస్యతో నీరు అందక పంటలు ఎండి పోతున్నాయని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో కరువు, ఎండలు తీవ్రమై రైతులు ఇబ్బందుల పాలు అవుతున్నారన్నారు. వేసిన వరిపంటలు ఎండిపోతున్నాయని ప్రభుత్వం పట్టించుకోవటం లేదని వారు విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులను ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు. నారాయణపూర్ గ్రామ రైతులు, నాయకులు పోస్టుకార్డులను ప్రదర్శించి రైతుల సమస్యలను పోస్టుకార్డుల ద్వారా సిఎం కార్యాలయంకు ఉత్తరాలు పంపటం జరుగుతుందని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిసిఎంఎస్ వైస్‌చైర్మన్ ఆర్.మధుకర్‌రెడ్డి, మండల బిఆర్ఎస్ అధ్యక్షులు జి.మల్లేశ్‌గౌడ్, మండల పరిషత్ కోఆప్షన్‌సభ్యులు గౌస్‌పాష, నారాయణపూర్ గ్రామ మాజీ సర్పంచు రాంచంద్రయ్య, మండల నాయకులు సిహెచ్ విష్ణువర్ధన్‌రెడ్డి, బుద్ధి అంజనేయులు, బి.లక్ష్మయ్య,డైరక్టర్ విష్ణు, సురేశ్, జహంగీర్, పలువురు రైతులు పాల్గొన్నారు.

## గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం


మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

**కడ్తాల్ ఏప్రిల్ 30, ప్రభాతవార్త :**
రంగారెడ్డి జిల్లా కడ్తాల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మక్తమాధారం శివారులో ఒక వెంచర్‌లో గుర్తు తెలియని వ్యక్తి హత్యకు గురయ్యాడు. సుమారు 40, 45 ఏళ్ల వయస్సు గల గుర్తు తెలియని వ్యక్తిని గుర్తు తెలియని దుండగులు హత్యచేసి పెట్రోల్ పోసి కాల్చారు. ఉదయం గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సంఘటన స్థలానికి చేరుకున్న షాద్‌నగర్ ఏసీపీ రంగస్వామి, సిఐ శివప్రసాద్, క్లూస్‌టీం సిబ్బంది మృతదేహాన్ని పరిశీలించారు. హత్య జరిగిన పరిసరాలను పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శి రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు.

## ఎల్లగూడెం వాగులో చేపలు పట్టటానికి వెళ్లి వ్యక్తి మృతి

**శామీర్‌పేట, ఏప్రిల్ 30, ప్రభాతవార్త**
అద్రాస్‌పల్లి గ్రామానికి చెందిన కావలి మల్లేశ్ ఎల్లగూడెం వాగులో నీటిలో చేపలు పట్టటానికి వెళ్లి వాగులో పడి మృతి చెందారు. శామీర్‌పేట పోలీసుల కథనం ప్రకారం మూడుచింతలపల్లి మండలంలోని అద్రాస్‌పల్లి గ్రామానికి చెందిన కావలి మల్లేశ్ (55) ఎల్లగూడెం వాగులో చేపలు పట్టటానికి సోమవారం ఉదయం 11గంటలకు ఇంటి నుంచి వెళ్లినట్లు సాయంత్రం వరకు తిరిగి ఇంటికి రాలేదని అన్నారు. అయితే కుటుంబ సభ్యులు ఎల్లగూడెం వాగు వద్ద రాత్రి వరకు వెతకటంతో కావలి మల్లేశ్‌కు సంబంధించిన బట్టలు, ఫోన్, వాహనం కనిపించినట్లు తెలిపారు. అయితే అతను కనిపించలేదని మంగళవారం ఉదయం 8గంటల సమయంలో ఎల్లగూడెం వాగులో నీటిపై కావలి మల్లేశ్ శవమై తేలినట్లు పోలీసులు తెలిపారు. చేపలు పట్టటానికి వెళ్లి ప్రమాదవశాత్తు నీటి మునిగి చనిపోయి ఉండవచ్చని భావిస్తున్నట్లు తెలిపారు. ఆ వాగులోని నీటి నుంచి మృతదేహాన్ని వెలికి తీశారు. ఆ తరువాత గాంధీ హాస్పిటల్ మార్చురికి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహ్యాన్ని తరలించినట్లు పోలీసులు తెలిపారు. శామీర్‌పేట పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# 10 ఫలితాల్లో సత్తా చాటిన విద్యార్థులు

**మునిపల్లి, ఏప్రిల్ 30, ప్రభాతవార్త:** మండలంలోని ఆయా పాఠశాలల్లో 10వ తరగతిలో విద్యను అందుకుని పరీక్షలు రాసిన 412 మంది విద్యార్థుల్లో 411 మంది ఉత్తీర్ణులైనట్లు మండల విద్యాధికారి దశరథ్ తెలిపారు.

**మోడల్ స్కూల్‌లో 100 శాతం ఉత్తీర్ణత...**
మండలంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో 10లో విద్యను అందుకుని పరీక్షలు రాసిన 97 మంది విద్యార్థులు ఉత్తీర్ణులైనట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. రామ్‌శ్రీజా 10 జిపిఏ సాధించగా బావిని ప్రశాంత్‌కుమార్, సి.అక్షిత, సాలె దీపికా, యెన్నంపల్లి గణేశ్, చాకలి అర్చన, దూదేకుల రహమాన్, జి దీపికా, భానుప్రసాద్‌గౌడ్, పైతరి కార్తీక్, షఫోరామాహిన్‌లు 9.7 జిపిఏ సాధించినట్లు ప్రిన్సిపల్ భాస్కర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని పాఠశాలల వారిగా ఫలితాలను పరిశీలిస్తే...మునిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 39 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 39 మంది ఉత్తీర్ణులైనట్లు,కంకోల్ జడ్పీహెచ్ఎస్ నుంచి 41 మంది 41 మంది, లింగంపల్లి టిఎస్ బాయ్స్ రెసిడెంట్ స్కూల్‌లో 70 మందికి 70 మంది, చెల్మెడ జడ్పీహెచ్ఎస్‌లో 7 మందికి 7 మంది, బుదేరా జడ్పీహెచ్ఎస్‌లో 11 మందికి 11 మంది, తాటిపల్లి జడ్పీహెచ్ఎస్‌లో 9 మందికి 9 మంది, మల్లికార్జున్‌పల్లి జడ్పీహెచ్ఎస్‌లో ఐదుగురికి ఐదుగురు, పెద్దగోపులారం జడ్పీహెచ్ఎస్‌లో 11 మందికి 11 మంది, లోనికలాన్ జడ్పీహెచ్ఎస్‌లో 24 మందికి 24 మంది, కమ్మంపల్లి జడ్పీహెచ్ఎస్‌లో 22 మందికి 22 మంది, అంతారం జడ్పీహెచ్ఎస్‌లో 9 మందికి 9 మంది, మేళసంగం జడ్పీహెచ్ఎస్‌లో 5గురికి 5గురు, తాటిపల్లి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో 39 మందికి 39 మంది, తెలంగాణ మోడల్ స్కూల్‌లో 97 మందికి 97 మంది ఉత్తీర్ణులు కాగా కంకోల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉర్దూ మీడియం పాఠశాల నుంచి 23 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 22 మంది విద్యార్థులు అయ్యారు. కంకోల్ జిల్లా పరిషత్, లింగంపల్లి టిఎస్ బాయ్స్ రెసిడెంట్, తెలంగాణ మోడల్ స్కూల్, కమ్మంపల్లి పాఠశాలలకు చెందిన ఒకొక్క విద్యార్థి 10 జిపిఏ సాధించినట్లు ఎంఈఓ దశరథ్ వివరించారు.

**న్యాల్‌కల్ మండలంలో 98 శాతం ఉత్తీర్ణత**
**న్యాల్‌కల్, ఏప్రిల్ 30, ప్రభాతవార్త:** మండలంలోని ఆయా పాఠశాలల్లో 10వ తరగతిలో విద్యను ఆర్జించి ఇటీవల పరీక్షలకు హాజరయిన విద్యార్థుల్లో 98శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులైనట్లు మండల విద్యాధికారి మారుతి రాథోడ్ తెలిపారు. మండంలోని హద్నూర్, మామిడ్గి, చాల్కి, చీకూర్తి, మెటల్‌కుంట పాఠశాలలో విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణులైనట్లు ఎంఈఓ పేర్కొన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలైన హద్నూర్‌లో 23 మందికి 23 మంది, మామిడ్గిలో 33 మందికి 33 మంది, చాల్కిలో 27 మందికి 27 మంది, చీకూర్తిలో 19 మందికి 19 మంది, మెటల్‌కుంటలో 57 మందికి 57 మంది విద్యార్థులు ఉత్తీర్ణులు కాగా మిర్జాపూర్(బి)ఓ 56 మందికి 55 మంది, రేజింతల్‌ల 19 మందికి 17, న్యాల్‌కల్‌లో 119 మందికి 115 మంది, న్యాల్‌కల్ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో 36 మందికి 35 మంది విద్యార్థులు ఉత్తీర్ణులు అయ్యారన్నారు. న్యాల్‌కల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి మహ్మద్ సద్దాం, మెటల్‌కుంట జడ్పీహెచ్ఎస్ విద్యార్థిని ఆసిఫా బేగంలు 9.8 జిపిఏ సాధించినట్లు ఎంఈఓ మారుతి రాథోడ్ పేర్కొన్నారు.

**నారాయణఖేడ్ పట్టణంలో...**
**నారాయణఖేడ్, ఏప్రిల్ 30 ప్రభాతవార్త:** పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో నారాయణఖేడ్ పట్టణంలోని విజేత పాఠశాలకు చెందిన విద్యార్థిని అనురిత మంగళవారం విడుదలైన ఫలితాల్లో 10 జీపీఏతో సత్తా చాటింది. నారాయణఖేడ్ పట్టణానికి చెందిన శనిగరపు సత్యనారాయణ సువర్ణల కుమార్తె అనురిత 10 జీపీఏ సాధించడంతో కుటుంబ సభ్యులు, విజేత పాఠశాల సిబ్బంది సంతోషం వ్యక్తం చేసి శుభాకంక్షలు తెలిపారు. ఇందుకు సహకరించిన టీచర్లకు, తల్లిదండ్రులకు శనిగారపు అనురిత ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపింది.

**ఝరాసంగం మోడల్ స్కూల్‌లో...**
**ఝరాసంగం, ఏప్రిల్ 30, ప్రభాతవార్త:** మండలంలోని మోడల్ స్కూల్‌లో 10వ తరగతిలో విద్యను అందుకుని పదవ తరగతి పరీక్షలు రాసిన మహేశ్వరి ఫలితాల్లో సత్తాచాటింది. మండలంలోని ఈదులపల్లి గ్రామానికి చెందిన తాజీ మాజీ సర్పంచ్ బస్వరాజ్ పాటిల్ కుమార్తె మహేశ్వరి 10 పరీక్షల్లో 10 జిపిఏ సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు తెలిపారు. 10 జిపిఏ సాధించిన మహేశ్వరిని పాఠశాల ఉపాధ్యాయులతో పాటు గ్రామస్థులు ప్రత్యేకంగా అభినందించారు.

**కంది మండలంలో 99.5 శాతం...**
**కంది, ఏప్రిల్ 30, ప్రభాతవార్త:** మండలంలోని 7 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 6 పాఠశాలల్లో 10 వార్షిక పరీక్ష ఫలితాల్లో వంద శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు.కంది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 32 మంది విద్యార్థులకుగాను 32 మంది, ఓడిఎఫ్ జడ్పీహెచ్ఎస్‌లో 23 మంది 23 మంది, ఏద్దు మైలారంలో 36 మందికి 36 మంది, ఇంద్రకరణలో 28 మందికి 28 మంది, కలివేములలో 8 మందికి మంది, చేర్యాలలో 81 మందికి 81 మంది విద్యార్థులు ఉత్తీర్ణులు కాగా మామిడిపల్లి పాఠశాలలో 22 మంది విద్యార్థులకు గాను 21 మంది ఉత్తీర్ణులయ్యారని మండల విద్యాధికారి తెలిపారు.

**చేర్యాల విద్యార్థుల ప్రతిభ...**
మండలంలోని చేర్యాల పాఠశాల జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి ఫలితాల్లో వంద శాతం (81 మందికి 81) మంది ఉత్తీర్ణత సాధించారు.పాఠశాల విద్యార్థులు 5 మంది విద్యార్థులు(నౌషీన్‌బేగం, కీర్తన, కావ్యాంజలి, శృతి, మమత) 9.8 జిపిఏ, సాయిచరణ్‌రెడ్డి సాదియా నాజ్నీన్‌లు 9.7 జిపిఏ సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు తెలిపారు.

**పుల్కల్ మండలంలో 99 శాతం...**
**పుల్కల్, ఏప్రిల్ 30, ప్రభాతవార్త:** మండలంలో 10వ తరగతి వార్షిక పరీక్షల్లో 99 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులయినట్లు మండల విద్యాధికారి డి.అంజయ్య తెలిపారు. సింగూరు, గొంగులూరు, ముది మాణిక్, పుల్కల్ కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం, సింగూరు గురుకుల పాఠశాలల్లో 100 శాతం మంది ఉత్తీర్ణులైనట్లు ఎంఈఏ పేర్కొన్నారు. మండలంలో 421మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 415 మంది ఉత్తీర్ణులైనట్లు తెలిపారు.

**చౌటకూరు మండలంలో 4 పాఠశాలల్లో 100 శాతం...**
చౌటకూరు మండలంలోని ఆయా పాఠశాలల్లో 194 మంది విద్యార్థులు 10వ తరగతి పరీక్షలు రాయగా 192 మంది ఉత్తీర్ణులైనట్లు ఎంఈఓ డి.అంజయ్య పేర్కొన్నారు. శివంపేట, చౌటకూరు, కోర్పోల్, ఆశ్రమ పాఠశాలల్లో 100 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులు అయినట్లు పేర్కొన్నాఉ. శివంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని ఇందూ 10 జిపిఏ సాధించిందన్నారు.

**పాపన్నపేట మండలంలో 94.89 శాతం...**
**పాపన్నపేట, ఏప్రిల్ 30, ప్రభాతవార్త:** మండలంలోని ఆయా గ్రామాల్లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో 94.89 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులైనట్లు మండల విద్యాధికారి నీలకంఠం తెలిపారు. మండల వ్యాప్తంగా 529 మంది విద్యార్థులు (బాలురు 283, బాలికలు 246) పరీక్షలకు హాజరు కాగా 270 మంది బాలురు, 232మంది బాలికలు ఉత్తీర్ణులైనట్లు తెలిపారు. మండలంలోకి కుర్తివాడ పాఠశాలకు చెందిన వరలక్ష్మి 9.8 జిపిఏ సాధించి మండల టాపర్‌గా నిలిచిందన్నారు. మండలంలోని కుర్తివాడ, గాంధారిపల్లి, కోడపాక, కేజీబీవి పాఠశాలల్లో 100 శాతం మంది ఉత్తీర్ణులయ్యారు.

**మనూర్ మండలంలో 100 శాతం ఉత్తీర్ణత**
**మనూర్, ఏప్రిల్ 30, ప్రభాతవార్త:** మండలంలోని పదవ తరగతి విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణులైనట్లు మండల విద్యాధికారి తెలిపారు. మండలంలోని ఆయా పాఠశాలలకు చెందిన 246 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 246 మంది ఉత్తీర్ణులయ్యారన్నారు. మనూర్ తోపాటు బోరంచ, పుల్‌కుర్తిలోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాల, బెల్లాపూర్ పాఠశాలలకు చెందిన ఒక్కొక్క విద్యార్థి 10 జిపిఏ సాధించినట్లు వివరించారు.

**మోడల్ స్కూల్‌లో వంద శాతం...**
**రామచంద్రాపురం, ఏప్రిల్ 30,ప్రభాతవార్త:** మండలంలోని వెలిమెల తెలంగాణ మోడల్ స్కూల్‌లో 10వ తరగతిలో 100 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులైనట్లు ప్రిన్సి పాల్ ఏ.రాంప్రసాద్ తెలిపారు.పాఠశాలలో విద్యను అందుకుని పరీక్షలకు హాజరైన 99 మంది విద్యార్థులు 99మంది ఉత్తీర్ణులైనట్లు పేర్కొన్నారు. పాఠశాలకు చెందిన ఎ మానస, ఎన్వఇ వైష్ణవిలు 9.8 జిపిఏ, సి నవ్య, ఆయుషి కుమారిలు 9.7, ఎం దివ్యశ్రీ, సి మానస ప్రీతి కుమారిలు 9.5, చిరుపవన్, సి రూపాలి, ఎన్ వర్షలు 9.3 జిపిఏ సాధించినట్లు పాఠశాల ప్రిన్సి పాల్ తెలిపారు. ఉత్తమ ప్రతిభ చాటిన విద్యార్థులకు ప్రిన్సిపాల్‌తో పాటు ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు. 9.8 జిపిఏ సాధించిన విద్యార్థినికి 1 వేయి రూపాయలు, బహుమతి, 9.7 జిపిఏ సాధించి విద్యార్థులకు 1 వేయి నగదు బహుమతులు అందించి ప్రోత్స హించారు.

**పదవ ఫలితాలలో మంజీరా విద్యార్థుల ప్రతిభ**
**రామాయంపేట మున్సి పాలిటీ, ఏప్రిల్ 30,ప్రభాతవార్త:**
రాష్ట్ర వ్యాప్తంగా మంగళవారం విడుదలైన పదవ తరగతి పరీక్షల ఫలితాలలో రామాయంపేట పట్టణానికి చెందిన విద్యార్థిని, విద్యార్థులు ఉత్తమప్రతిభ కనబర్చారు. స్థానిక మంజీరా విద్యాలయంలో విద్యనభ్యసించిన జె.హరిణి, వి.సాయి చంద్ర, ఎన్.శ్రీవర్ష, జీ.విగ్నేశ్వర్‌లు 10/10 జిపిఎ సాధించారు. ఎమ్.వైశాలి, కే.శ్రీజ, బి.గాయత్రిలు 9.8 జిపిఎ సాధించగా, మరో 31 మంది విద్యార్థులు 9.0 జిపిఎ సాధించి పాఠశాలలో 100 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు, విద్యార్థిని, విద్యార్థులందరికీ పాఠశాల యాజమాన్యం తరపున అభినందనలు తెలియజేస్తున్నామని బి.మధుసూదన్‌రెడ్డి, జి.కరుణాకర్‌రెడ్డి, పి.రామచంద్రంగౌడ్, సాంగని యాదగిరి, సరికొండ జితేందర్ రెడ్డి, శీలం సుజిత్‌రెడ్డి, ప్రిన్సి పాల్ పుట్టి సురేష్, వాసవి తెలిపారు. విద్యార్థినీ, విద్యార్థుల కృషి వలన ఇలాంటి ఫలితాలు సాధంచారని పేర్కొన్నారు. ఇటీవల ఇంటర్ ఫలితాలలో మంజీరా విద్యాలయం విద్యార్థిని మర్కు శ్రీనిది ఎంపిసీవిభాగంలో 956/1000 సాధించి డివిజన్ టాపర్‌గా నిలిచిందని వారు తెలిపారు. జేఈఈ మెయిన్స్ ఫలితాలలో తమ విద్యార్థిని ఎం.స్నేహలత 98.13 ర్యాంక్ సాధించి టాపర్‌గా నిలవడం సంతోషకర మన్నారు.

**వివేకానంద విద్యాలయంలో...**
పట్టణానికి చెందిన వివేకానంద విద్యాలయంలో పదవ పరీక్షల ఫలితాలలో 100 శాతం ఉత్తీర్ణత సాధించారు. పాఠశాలకు చెందిన కే. ఆనంద్‌రాజ్ 10/10 జిపిఎ సాధించగా, 9.8 జిపిఎ ఏడుగురు, 9.7 జిపిఎ ఒకరు, 9.5 జిపిఏ ఏడుగురు, 9.3 జిపిఎ ముగ్గురు, 9.2 జిఎపి ఆరుగురితో పాటు 9.0 జిపిఎ ఎనిమిది మంది విద్యార్థులు సాధించారు. ఈ సందర్బంగా పాఠశాల ప్రిన్సి పాల్ ఏ.రాంకుమార్ వారిని అభినందించారు.

**రామాయంపేట మండలంలో...**
**రామాయంపేట, ఏప్రిల్ 30, ప్రభాతవార్త :** రాష్ట్ర వ్యాప్తంగా మంగళవారం విడుదలైన పదవ తరగతి ఫలితాలలో రామాయంపేట మండలంలో 96శాతం ఉత్తీర్ణత సాధించారని, అందులో బాలికలదే పైచేయిగా ఉత్తీర్ణత సాధించారని మండల విద్యాధికారి నీలకంఠం తెలిపారు. ఆయన మాట్లాడుతూ రామాయంపేట మండలంలో పరీక్షలకు 396 మంది బాలికలు, 371 మంది బాలురు మొత్తం 767 మంది విద్యార్థులు హాజరయ్యారు. అందులో 384 మంది బాలికలు 97శాతం ఉత్తీర్ణత సాధించగా, 353 మంది బాలురు 95శాతం ఉత్తీర్ణత సాధించారు. మండలంలో ప్రభుత్వ పాఠశాలకు సంబంధించి అత్యధిక మార్కులు సాధించినటువంటి రామాయంపేట జిల్లా పరిషత్ బాలికల పాఠశాల, మోడల్ స్కూల్, సోషల్ వెల్ఫేర్‌లలో 9.8జిపిఏ సాధించిన విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు. 100శాతం ఉత్తీర్ణత సాధించినటువంటి పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు, ఉపాధ్యాయులకు, విద్యార్థుల తల్లిదండ్రులకు, మరియు విద్యార్థులకు అభినందనలు తెలియజేస్తున్నామన్నారు.

**సిర్గాపూర్ జడ్పీహెచ్ఎస్‌లో 100 శాతం ఉత్తీర్ణత**
**సిర్గాపూర్, ఏప్రిల్ 30, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన సిర్గాపూర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 100 శాతం మంది విద్యార్థులు ఎస్ఎస్‌సిలో ఉత్తీర్ణులు అయినట్లు ప్రధానోపాధ్యాయులు తెలిపారు.
పాఠశాలలో 10లో విద్యను అందుకుని పరీక్షలు రాసిన 92 మంది విద్యార్థులు 92 మంది ఉత్తీర్ణులైనట్లు తెలిపారు. పాఠశా లకు చెందిన బందగార్ సాయిరామ్ 9.8, మడపతి అశ్విని 9.7, వడ్ల అనుష 9,5జిపిఏలతో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను కైవశం చేసుకున్నట్లు ప్రధా నోపాధ్యాయులు తెలిపారు. ఉత్తమ ప్రతిభ చాటిన విద్యార్థు లకు పాఠశాల బాధ్యులు ప్రత్యేకంగా అభినందించారు.

**నాగల్‌గిద్దలో 100 శాతం ఉత్తీర్ణత...**
**నాగల్‌గిద్ద, ఏప్రిల్ 30, ప్రభాతవార్త:** మండల కేంద్రంతో పాటు మండలంలోని కారముంగి, కరస్‌గుత్తి, మోర్గి మోడల్ పాఠశాలల్లో 10వ తరగతిలో 100 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు మండల విద్యాధికారి తెలిపారు. మోడల్ పాఠశాలలో ఉత్తీర్ణులైన విద్యార్థులను పాఠశాల ప్రిన్సి పాల రమేష్ ప్రత్యేకంగా అభినందించారు.

**కొల్చారం మండలంలో 96.78 శాతం...**
**కొల్చారం, ఏప్రిల్ 30 ప్రభాతవార్త:** మండలంలో ఎస్ఎస్‌సీ పరీక్షలకు బాలురు 208 మంది, బాలికలు 289 మంది మొత్తంగా 497 మంది విద్యార్థులు హాజరయ్యారని ఎంఇవో నీల కంఠం తెలిపారు. 196 మంది బాలురు (94.26%) ఉత్తీర్ణులయ్యారని, 285 మంది బాలికలు (98.62%) ఉత్తీర్ణత సాధించారని, మొత్తంగా మండలంలో 96.78 శాతం ఉత్తీర్ణత నమోదైందని వివరించారు. మండల పరిధిలోని రంగంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని నందిని 10/10 జీపీఏ సాధించి మండలంలోనే మొదటి స్థానంలో నిలిచిందని తెలిపారు. నాలుగు పాఠశాలలు 100 శాతం ఉత్తీర్ణత సాధించాయని, ఈ సంవత్సరం రెండు శాతం ఉత్తీర్ణత పెరిగేందుకుసహకరించిన ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులకు, విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు.

**వెల్దుర్తి మండలంలో బాలికలదే పైచేయి**
**వెల్దుర్తి, ఏప్రిల్ 30 ప్రభాతవార్త:** మంగళవారం వెలువడిన పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో బాలికలు పైచేయి సాధించారు. వెల్దుర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు హనుమాద్రి,జాహ్నవి, అభిలాష్, కుకునూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు లాస్యలు 9.7 జీపీఏ సాధించి మండల టాపర్లుగా నిలిచారు. మాసాయిపేట మండలంలో మొత్తం 101 విద్యార్థులకు గాను 98 మంది (97%) ఉత్తీర్ణత సాధించారు. వెల్దుర్తి మండలంలో 348 మందికి గాను 331 మంది (97%) ఉత్తీర్ణత సాధించారు. వెల్దుర్తిలోని కస్తూరిభా గాంధీ బాలికల పాఠశాలలో విద్యార్థినిలు వంద శాతం ఉత్తీర్ణత సాధించారు.

**జహీరాబాద్ మండలంలో 96.71 శాతం...**
**జహీరాబాద్, ఏప్రిల్ 30, ప్రభాతవార్త:** మండలంలోని 10వ తరగతిలో 96.71 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులు అయినట్లు ఎంఈఓ బస్వరాజ్ తెలిపారు. మండలంలోని ఆయా గ్రామాల్లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు 2560 మంది పరీక్షలకు హాజరు కాగా 2476 మంది విద్యార్థులు ఉత్తీర్ణులు అయినట్లు తెలిపారు. మొగుడంపల్లి మండలంలో 99.56 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులైనట్లు వివరించారు. జహీరాబాద్ మండలంలోన హుగ్గెల్లి, బూచినెల్లి,సత్వార్, అల్గోల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలతో పాటు రంజోల్‌లోని సాంఘీక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో 100 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు పేర్కొన్నారు. మండలంలో 34 మంది విద్యార్థులు 10 జిపిఏ సాధించినట్లు తెలిపారు. ఇదిలాఉండగా పట్టణంలోని ఆర్ఎల్ఆర్ పాఠశాలలో 212 మంది విద్యార్థులకు 212మంది ఉత్తీర్ణులైనట్లు, 12 మంది విద్యార్థులు 10 జిపిఏ సాధించినట్లు పాఠశాల ప్రిన్సి పాల్ పేర్కొన్నారు. హోతి(కే) లోని తెలంగాణ రాష్ట్ర బాలికల గురుకుల పాఠశాలలో 99 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులు అయ్యారు.

# నాలాలు, పార్కులు, చెరువుల ఆక్రమణపై చర్యలు తీసుకోవాలి

**-మంచినీటి, విద్యుత్, డ్రైనేజీ సమస్యలను పరిష్కరించాలి**
**-అవినీతి, అక్రమాలకు పాల్పడే అధికారులను ఉపేక్షించం**
**-ప్రజాసమస్యల పరిష్కారంపై శ్రద్ధ వహించాలి: ఎంపిపి**



మండల సభలో మాట్లాడుతున్న ఎంపిపి సుదర్శన్‌రెడ్డి


సమావేశంలో పాల్గొన్న ఎంపిటిసి సభ్యులు, అధికారులు

**ఘట్‌కేసర్, ఏప్రిల్ 30, ప్రభాతవార్త:**
అవినీతి, అక్రమాలను ప్రోత్స హించే అధికారులపై చర్యలు తప్పవని ఎంపిపి ఏనుగు సుదర్శన్‌రెడ్డి స్పష్టం చేశారు. ఘట్‌కేసర్ మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మంగళవారం ఎంపిపి ఏనుగు సుదర్శన్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది. పార్లమెంట్ ఎన్నికల కోడ్ ఉండటంతో మండల సభలో ఏలాంటి తీర్మాణాలు చేయకుండా ప్రజాసమస్యలపై అధికారులు, ఎంపిటిసిలు చర్చించారు. చౌదరిగూడ, ఎదులాబాద్, వెంకటాపూర్ పంచాయతీల పరిధిలోని కాలనీల్లో విద్యుత్, మంచినీటి, డ్రైనేజీ సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ప్రతి మండల సభలో అధికారులకు తెలియజేసినా పరిష్కారం చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఎంపిటిసిలు గట్టగల్ల రవి, పులకంటి భాస్కర్‌రెడ్డి, నిరుడి రామారావులు ఆవేదన వ్యక్తం చేశారు. నాలాలు, ప్రభుత్వ భూములు, చెరువుల ఎఫ్‌టిఎల్ స్థలాలు ఆక్రమణకు గురవుతున్నారని ఎంపిపి సుదర్శన్‌రెడ్డి అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇరిగేషన్, పంచాయతీ, రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యంతో గ్రామాల్లో సామాజిక స్థలాలు కబ్జాలకు గురవుతున్నాయని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించి అర్హులైన వారికి అందేలా చూడాలన్నారు. ప్రైవేటు పాఠశాలల్లో ఫీజుల నియంత్రణ లేక యాజమాన్యాలు ఇష్టానుసారంగా అధికంగా వసూలు చేస్తున్నారని ఎంఇఓకు తెలియజేశారు. కేంద్ర పథకాలపై మహిళలకు అవగాహన కల్పించి లబ్ది పొందేలా చూడాలని, అంగన్‌వాడీ అధికారులు, సిబ్బంది తమ పనితీరు మార్చుకోవాలని ఆయన సూచించారు. చౌదరిగూడలో మిషన్ భగీరథ నీరు సరఫరా చేయకున్నా బిల్లులు జారీ చేస్తున్నారని కొన్ని కాలనీల్లో పైపులైను వేయలేదని నీటిని సక్రమంగా అందించాలని జలమండలి అధికారులకు తెలిపారు. నాలాలు ఉన్న స్థలాల్లో భవనాల నిర్మాణం చేస్తుండటంతో వరద వచ్చినప్పుడు కాలనీలు మంపుకు గురవుతున్నాయని అధికారులు నాలాలను సంరక్షించి వరద నివారణ చర్యలు తీసుకోవాలన్నారు. అవుషాపూర్‌లో ఓవర్‌లోడ్, ట్రాన్స్‌ఫార్మర్ల సమస్యలపై పలుసార్లు తెలియజేసినా విద్యుత్ సిబ్బంది పరిష్కార ం చేయలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. చౌదరిగూడలో షెడ్డు నిర్మాణదారుని నుంచి పంచాయతీ పాలకవర్గం ఇటీవల రూ.5 లక్షలు వసూలు చేశారని అవినీతి పెరిగిపోతుందని అధికారులు చూసి పనిచేయాలని లంఛాలకు అలవాటు పడితే ఉన్నతస్థాయి అధికారులకు తెలియజేస్తామని ఎంపిపి హెచ్చరించారు. గత నాలుగున్నర సంవత్సరాల కాలంగా మండలాభివృద్ధికి కృషి చేశామని ప్రజాసమస్యల పరిష్కారం కోసం ఎంతగానో పనిచేశామని అధికారులు శ్రద్ధ చూపి గ్రామాలను మరింత అభివృద్ధి దిశగా తీసుకువెళ్లాని ఆయన సూచించారు. పలు శాఖల అధికారులు సభకు గైర్హా జరు కాగా హాజరైన అధికారులు తమ శాఖల ద్వారా 3 నెలలలో జరిగిన కార్యక్రమాల నివేదికలను సభలో తెలియజేశారు. ఈసమావేశంలో ఎంపిడిఓ ఎల్.గీతారెడ్డి, వైఎస్ ఎంపిపి కర్రె జంగమ్మ, సహకార సంఘం చైర్మన్ సింగిరెడ్డి రాంరెడ్డి, ఎంపిటిసి సభ్యులు గట్టగల్ల రవి, మలిపెద్ది వెంకట్‌రాంరెడ్డి, పులకంటి భాస్కర్‌రెడ్డి, కొమ్మిడి శోభారాణి, నిరుడి రామారావు, బొడ్డు వినోద, కోఆప్షన్ ఎండి.ఇక్బాల్, ఎంపిఓ రవి, ఎంఇఓ శశిధర్, వ్యవసాయాధికారి ఎం.ఎ.బాసిత్, పశువైద్యాధికారిణి పద్మిని, ఏఈలు వెంకట్‌రెడ్డి, సతీష్ కుమార్, జగపతి, హరిణి, అఖిల, ప్రభాకర్‌రెడ్డి, పరమేశ్, ఎపిఎం తావుర్యానాయక్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

# కేసీఆర్ పటాన్‌చెరు పర్యటనను విజయవంతం చేయాలి

**-పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి**

**గుమ్మడిదల, ఏప్రిల్ 30 ప్రభాతవార్త:**
పటాన్‌చెరు నియోజకవర్గం గుమ్మడిదలలోని సీజీఆర్ ట్రస్టు సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ పార్టీ ముఖ్య ప్రజాప్రతినిధులు, నాయకుల సమావేశంలో పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ మే 8వ తేదీ సాయంత్రం పటాన్‌చెరులో నిర్వహించ తలపెట్టిన మాజీ ముఖ్య మంత్రి కేసీఆర్ రోడ్‌షో కార్యక్రమంపై చర్చించారు. మండల పరిధిలోని ప్రతి గ్రామం నుండి కార్యకర్తలు,నాయకులు రోడ్‌షోకు హాజరయ్యేలా చూడాలని కోరారు. గుమ్మడిదల మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద మే 2న గురువారం సాయంత్రం 6 గంటలకు మాజీ మంత్రి హరీష్ రావు, మెదక్ పార్లమెంట్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డిల కార్నర్ సమావేశానికి సుమారు పది వేల మంది కార్యకర్తలతో రోడ్‌షో ఉంటుందని తెలిపారు. అలాగే రాబోయే పదకొండు రోజుల పాటు ఇంటింటి ప్రచారం చేపట్టి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి విజయానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ కుమార్‌గౌడ్, జిల్లా నాయకులు సీజీఆర్ ట్రస్టు చైర్మన్ చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి, మండల అధ్యక్షులు హుస్సేన్, సీనియర్ నాయకులు ఆలేటి శ్రీనివాస్ రెడ్డి, వేణు, సద్ది విజయభాస్కర్‌రెడ్డి, మేడిపల్లి మురళి, చిమ్ముల మల్లారెడ్డి, తాజా మాజీ సర్పంచి నరసింహారెడ్డి, యాదారం ధర్మారెడ్డి, అభిశెట్టి రాజశేఖర్, దోమడుగు శంకర్ గౌరీశంకర్, దామోదర్‌రెడ్డి, కొండల్‌రెడ్డి, మద్దుల బాల్‌రెడ్డి, చిమ్ముల దేవేందర్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు, ఆయా గ్రామాల తాజా మాజీ సర్పంచులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి కృషి



**అత్తాపూర్ ఏప్రిల్30,ప్రభాతవార్త :** న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి తనవంతుగా కృషి చేస్తానని చేవెళ్ల బిజెపి అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు.మంగళవారం రాజేంద్రనగర్ అసెంబ్లీ లీగల్ సెల్ కన్వీనర్ మిద్దె సుదర్శన్ ముదిరాజ్ ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ కోర్టు న్యాయవాదులను కొండా విశ్వేశ్వర్ రెడ్డి కలిశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... న్యాయవాదుల న్యాయపరమైన డిమాండ్‌లను నా పరిధిలో ఉంటే కచ్చితంగా పరిష్కారిస్తానని అన్నారు.అడ్వొకేట్స్ ప్రొటెక్షన్ యాక్ట్,పెర్మనెంట్ కోర్టు బిల్డింగ్ కొరకు సహకరిస్తానని తెలిపారు.ఈ సమావేశంలో న్యాయవాదులు మధు సూధన్ రెడ్డి,అమర్‌నాథ్ రెడ్డి,రాజు గౌడ్,ప్రసాద్ రెడ్డి,కొంగళ్ల నవీన్, క్రాంతి,బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వెంకట్ రెడ్డి,కార్యదర్శి శ్రీధర్ రెడ్డి, న్యాయవాదులు పాల్గొన్నారు.

## 2న కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం

**నాగల్‌గిద్ద, ఏప్రిల్ 30, ప్రభాతవార్త:** మే 2వ తేదీన నాగల్‌గిద్దలో కాంగ్రెస్ పార్టీ మండల కార్యకర్తల సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మాణిక్‌రావు పాటిల్, నాయకులు గుండేరావు పాటిల్‌లు తెలిపారు. కార్యకర్తల సమావేశానికి నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి, జహీరాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి సురేశ్ కుమార్ శెట్కార్‌లు ముఖ్య అతిథులుగా హాజరవుతున్నారన్నారు.

## యువకుడు అదృశ్యం...కేసు నమోదు

**రామాయంపేట మున్సిపాలిటీ, ఏప్రిల్ 30, ప్రభాతవార్త :** రామాయంపేట మున్సిపాలిటీ 7వ వార్డు పరిధిలోని గొల్పర్తి గ్రామానికి చెందిన అదృశ్యమయ్యాడు. మంగళవారం ఎస్ఐ రంజిత్‌కుమార్ కథనం ప్రకారం... గ్రామానికి చెందిన కుమ్మరి బాలయ్య కుమారుడు రాజ్‌కుమార్(26) బైక్ మెకానిక్‌గా పనిచేస్తున్నారు. కాగా గత నెల 20వ తేదీన ఇంట్లోంచి ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయాడు.ఇంతవరకు ఇంటికి రాకపోవడంతో మంగళవారం అతడి భార్య కుమ్మరి సరిత రామాయంపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినందున కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తుననట్లు ఎస్ఐ రంజిత్‌కుమార్ తెలిపారు.

## అనాథ చిన్నారులకు నిత్యావసర సరుకులు

**సిర్గాపూర్, ఏప్రిల్ 30, ప్రభాతవార్త:** మండలంలోని చీమల్‌పాడ గ్రామానికి చెందిన అనాథ చిన్నారులకు (తల్లిదండ్రులను కోల్పోయిన) చిన్నారులకు (అభిలాష్, హాని, ప్రిన్సీ, దీనా) ఎన్‌టిటిడిఎటిఎ స్లాఫ్ట్ వేర్ సంస్థ డైరెక్టర్ తిప్పరాజు ప్రసాద్ ఒక నెలకు సరిపడ నిత్యావసర సరుకులను మంగళవారం అందచేశారు.

## 32వ వార్షిక సర్వసభ్య సమావేశం

శామిర్‌పేట ఏప్రిల్30,ప్రభాతవార్త : హైదరాబాద్ సాఫ్టవేర్ ఎంటర్ ప్రైజెస్ అసోసియేషన్ 32వ వార్షిక సర్వసభ్య సమావేశంలో నూతన అధ్యక్షుడిని ఎన్నకున్నారు.ఫస్ట్సోర్స్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ ప్రశాంత్ నందెళ్ల 2024- 26 కాలానికి హైసియా అధ్యక్షుడిగా వ్యవహరిస్తారు.గత టర్మ్‌లో ఉపాధ్యక్షు డిగా సహా క్రియాశీల మేనేజింగ్ కమిటీ,ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుడిగా ప్రశాంత్ హైసియాలో కీలక పాత్ర పోషించారు.హైసియా కోసం అనేక కార్యక్రమాలను విజయవంతంగా నడిపించి ఫోరమ్‌కు జాతీయ స్థాయిలో గుర్తింపును తెచ్చిపెట్టారు.

## భువనగిరి పార్లమెంట్ లీగల్ సెల్ కన్వీనర్‌గా అడ్వకెట్ విజయ్ నాయక్



**యాచారం ఏప్రిల్30,ప్రభాతవార్త :**
భువనగిరి పార్లమెంట్ లీగల్ సెల్ కన్వీనర్‌గా అడ్వకెట్ విజయ్ నాయక్‌ను బిజెపి రాష్ట్ర లీగల్ సెల్ కన్వీనర్ రామారావు నియమించారు.మంగళవారం రంగారెడ్డి జిల్లా కోర్టు ప్రాంగణంలో ఈ కార్యక్రమం జరిగింది.తదనంతరం విజయ్ నాయక్‌ను న్యాయవాదుల సమక్షంలో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా అడ్వకెట్ విజయ్ నాయక్ మాట్లాడుతూ...భువనగిరి పార్లమెంట్ లీగల్ సెల్ కన్వీనర్‌గా నియమించినందుకు చాలా సంతోషంగా ఉందన్నారు.మోడీ నాయకత్వంలో దేశ ప్రజల అభివృద్ధికి కృషి చేస్తానని,పేద ప్రజలకు న్యాయపరమైన సేవలు అందిస్తానని అన్నారు.వచ్చే పార్లమెంటరీ ఎన్నికలో బిజెపి అధిక మోజర్టీతో గెలవడానికి నిస్వార్థంగా పని చేస్తానన్నారు.ఈ కార్యక్రమంలో పీతం ప్రదీప్ కుమార్,నరేష్ కుమార్,రంగారెడ్డి జిల్లా బార్ అసోసియేషన్ ఈసి మెంబర్ వంశీ కృష్ణ, న్యాయవాదులు మురళి కృష్ణ ,ప్రశాంత్,నరేష్, రామ్అర్జున్, తదితరులు పాల్గొన్నారు.

## సమాజానికి ఆదర్శంగా ఎదగాలి



విద్యార్థులను సన్మానిస్తున్న టి. వెంకటయ్య

**ఆమనగల్లు, ఏప్రిల్30, ప్రభాతవార్త:**
క్రమశిక్షణ, అంకితభావంతో కూడిన విద్యనభ్యసించి విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు ఎదగాలని పీఏసిఎస్ మాజీ అధ్యక్షుడు, ప్రజ్ఞ ఎడ్యుకేషనల్ చైర్మన్ టి. వెంకటయ్య అన్నారు. మంచి నడవడికతో ప్రతి విద్యార్థి సమాజానికి ఆదర్శంగా నిలవాలని ఆయన పిలుపునిచ్చారు. మంగళవారం ఆమనగల్లు పట్టణంలోని ప్రజ్ఞ ఉన్నత పాఠశాల్లో ఏర్పాటు చేసిన అభినందన సమావేశంలో టి. వెంకటయ్య ముఖ్య అతిథిగా హాజరై పదవతరగతి ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన ప్రజ్ఞ ఉన్నత పాఠశాల విద్యార్థులు అఖిల్ 10/10, శ్రీరాజ్ 9.8 సాధించిన విద్యార్థులను సన్మానించారు. ప్రతి విద్యార్థి ఉన్న లక్ష్యాలను ఎంచుకుని వాటి సాకారానికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో సలహాదారులు అశోక్‌రెడ్డి, కరస్పాండెంట్ కసిరెడ్డి జ్యోతి, టి.రాఘవేందర్, ప్రిన్సిపాల్ ఈ. రమేష్, ఉపాధ్యాయబృందం రవికుమార్, శంకర్, కృష్ణ ఉన్నారు.

## చౌకధర దుకాణాల్లో అక్రమాలను ఉపేక్షించం

-రాష్ట్ర ఫుడ్ కమీషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి



ఆమనగల్లులో విలేకరులతో మాట్లాడుతున్న రాష్ట్ర ఫుడ్ కమీషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి

**ఆమనగల్లు, ఏప్రిల్30, ప్రభాతవార్త:**
చౌకధర దుకాణాల్లో అవినీతి అక్రమాలను అరికట్టేందుకు పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక నిఘా వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు రాష్ట్ర ఫుడ్ కమీషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. రేషన్ దుకాణాల్లో చట్టవిరుద్ధ చర్యలను ఉపేక్షించేది లేదన్నారు. హోటళ్ళు, తినుబండారాల కేంద్రాల్లో ఆహార కల్తీకి పాల్పడినా చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. అక్రమమార్గం ఎంచుకున్నవారు ఎంతటి వారైన కఠిన చర్యకు గురికాకతప్పదన్నారు. డీలర్లు ప్రజలకు ఇబ్బందులు కలగకుండా బియ్యాన్ని సకాలంలో సక్రమంగా సరుకులను అందజేయాలని ఆయన కోరారు. మంగళవారం ఆమనగల్లు పట్టణంలోని పలు హోటళ్ళు, రేషన్ దుకాణాలను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. అనంతరం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన ఆహారాన్ని అందించేలా హోటల్ యజమానులకు సూచించారు. రాష్ట్రంలో ఎక్కడ కల్తీకి తావులేకుండా ఫుడ్ కమీషన్ ద్వారా కార్యాచరణ రూపొందిస్తుందన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు. కార్యక్రమంలో చంద్రశేఖర్‌రెడ్డి, రూపం వెంకట్‌రెడ్డి, దశరథ్‌నాయక్,జహంగీర్, చలిచీమల సతీష్, కొమ్ము ప్రసాద్ తదితరులు ఉన్నారు.

## రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో విద్యార్థినిల హవా



అథ్లెటిక్స్ క్రీడా పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థినిలను అభినందించిన మహేంద్ర హిల్స్ డిగ్రీ మహిళా విద్యార్థినిలను అభినందించిన ప్రిన్సిపాల్ విజయలక్ష్మి.

**ఘట్‌కేసర్ రూరల్, ఏప్రిల్ 30,ప్రభాతవార్త:**
రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థినిలను కళాశాల ప్రిన్సిపాల్ విజయలక్ష్మి అభినందించారు. ఇటీవల సూర్యాపేట జిల్లాలోని ఎస్‌వి. డిగ్రీ కళాశాలలో నిర్వహించిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో అంకుశాపూర్‌లోని మహేంద్ర హిల్స్ డిగ్రీ గురుకుల క్రీడా అకాడమీ విద్యార్థినిలు 3 స్వర్ణ, 2 రజిత, 4 కాంస్య పతకాలు సాధించి ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు ప్రిన్సిపాల్ విజయలక్ష్మి మంగళవారం నాడొక ప్రకటనలో తెలిపారు. అథ్లెటిక్స్ క్రీడాపోటీల్లో రాణించిన విద్యార్థినిలకు కళాశాల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో శాలువా కప్పి ప్రిన్సిపాల్ అభినందించినట్లు తెలిపారు. స్వర్ణ పతకం సాధించిన వారిలో ( అండర్ 20 ) 1500 మీటర్ల పరుగుపందెంలో ఎం. మనీషా, 100 మీటర్ల పరుగు పందెంలో ఎం. పూజ, 800 మీటర్ల పరుగు పందెంలో స్వర్ణ ప్రథమ స్థానంలో నిలిచి స్వర్ణ పతకం సాధించినట్లు తెలిపారు. రజతం సాధించిన వారిలో టాబు, ఎన్. అనుషా రజత పతకాలు సాధించినట్లు తెలిపారు. కాంస్య పతకాలు సాధించిన వారిలో పి. ఉషారాణి, జి. కల్పన, సాత్వికాంజలి, కె. మానసలున్నారు. క్రీడల్లో రాణించిన విద్యార్థినిలను కళాశాల ప్రిన్సిపాల్ విజయలక్ష్మితో పాటు స్పోర్ట్స్ ఆఫీసర్ రామలక్ష్మణ్, నోడల్ ఆఫీసర్ శేషుకుమారి, వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మి, స్పోర్ట్స్ ఇంఛార్జీ పద్మజా, అథ్లెటిక్స్ కోచ్ బిక్షపతి, పీడీ. శోభ, హ్యాండ్ బాల్ కోచ్ పద్మిని గుప్తా తదితరులున్నారు.

# కెసిఆర్ బస్సుయాత్రతో కాంగ్రెస్, బిజెపిలకు గుబులు

## -మాజీ ఎమ్మెల్యే గుర్కా జైపాల్‌యాదవ్



ఆమనగల్లులో విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గుర్కా జైపాల్‌యాదవ్

**ఆమనగల్లు, ఏప్రిల్30, ప్రభాతవార్త:**
కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వాలపై ప్రజల్లో విశ్వాసం పూర్తిగా సన్నగిల్లిపోయిందని, వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్, బీజేపీలకు తగిన గుణపాఠం చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని బీఆర్ఎస్ నేత, కల్వకుర్తి నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే గుర్కా జైపాల్‌యాదవ్ అన్నారు. అధికార మధంతో రెండు పార్టీలు భ్రమలో మునిగిపోయి పాలనను పట్టించుకోవడం లేదని, బీజేపీ, కాంగ్రెస్ ప్రభుత్వాల అసమర్థపాలనలో రైతులు, ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన విమర్శించారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ బస్సుయాత్రతో రాష్ట్రంలో ఎన్నికల వాతావారణం పూర్తిగా మారిపోయిందని, బస్సుయాత్రతో కాంగ్రెస్, బీజేపీ పార్టీల గుండెల్లో గుబులు పుట్టుకుందని ఆయన ఎద్దేవా చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యంతో రెండు పార్టీల విజయావకాశాల గ్రాఫ్ పూర్తిగా పడిపోయిందని, అన్ని నియోజకవర్గాల్లో కేసీఆర్ బస్సుయాత్రకు ప్రజలు పడుతున్న బ్రహ్మరథం అందుకు నిదర్శనమన్నారు. రాష్ట్ర ఫుడ్ కమీషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి, జడ్పీటీసీ జర్పుల దశరథ్‌నాయక్, నేనావత్ దశరథ్‌నాయక్, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు దోనాదుల కుమార్, మండల పార్టీ అధ్యక్షుడు అర్జున్‌రావు, పత్యనాయక్‌తో కలిసి జైపాల్‌యాదవ్ మంగళవారం ఆమనగల్లు పట్టణంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ 12 స్థానాలను కైవసం చేసుకుని కేంద్రంలో క్రియాశీలకంగా వ్యవహరిస్తుందన్నారు. బీఆర్ఎస్ పాలనలోనే గిరిజనులకు తగిన గుర్తింపు లభించిందని, వారి సంక్షేమానికి బీఆర్ఎస్ ప్రభుత్వం అనేక పథకాలు ప్రవేశపెట్టి అమలు చేసిందన్నారు. గిరిజనులకు స్వయంపాలన అందించాలనే ఆకాంక్షతో కేసీఆర్ తండాలను గ్రామపంచాయతీలుగా మార్చి వారి చిరకాల కోరిక నెరవేర్చారని కొనియాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలే బీఆర్ఎస్ పార్టీ గెలుపుకు నాంది కానుందని రాష్ట్ర ఫుడ్ కమీషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చని పార్టీలను ప్రజలు తిరస్కరిస్తారని, బీఆర్ఎస్ ప్రభుత్వానికి కాంగ్రెస్ ప్రభుత్వానికి పొంతన లేదని ఆయన ఘాటుగా విమర్శించారు.

**మే 2న ఆమనగల్లులో 'బీఆర్ఎస్ గిరిజన గర్జన'....**

ఆమనగల్లు పట్టణంలో శ్రీలక్ష్మి ఫంక్షన్ హాలులో మే 2న బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో గిరిజన గర్జన ప్రత్యేక కార్యక్రమం ఉంటుందని గిరిజన సంఘం రాష్ట్ర నాయకుడు, బీఆర్ఎస్ పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షుడు నేనావత్ పత్యనాయక్ అన్నారు. 10వేల మంది గిరిజనులతో నిర్వహించే గర్జన సభకు మాజీ మంత్రి సత్యవతిరాథోడ్, కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే గుర్కా జైపాల్‌యాదవ్, నాగర్‌కర్నూల్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, రాష్ట్రఫుడ్ కమీషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి, ఇతరులు హాజరౌతున్నట్లు ఆయన వివరించారు. విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ నేతలు సోనశ్రీనునాయక్, సరిత పంతునాయక్, లక్ష్మణ్‌నాయక్, సయ్యద్ ఖలీల్, ఎంగలి రఘు, సురమళ్ళ సుభాష్, రమేశ్‌నాయక్, కోటపెద్దశ్రీను, సోమనాయక్ తదితరులు ఉన్నారు.

# భవాని మాత ఆసీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలి

## -ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

**పెద్దేముల్, ఏప్రిల్ 30, ప్రభాతవార్త:**
భవాని మాత ఆసీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. మంగళవారం పెద్దేముల్ మండలం రుద్రారంలో మాజీ డిసిసిబి చైర్మెన్ పి.లక్ష్మారెడ్డి, మాజీ వైస్ యంపిపి పి.గోపాల్‌రెడ్డి, కాంగ్రెస్‌యువనాయకులు పి.మహిపాల్‌రెడ్డి అధ్వర్యంలో భవాని మాత(బోనమ్మ) ఆలయాన్ని పునర్నిర్మానం చేపట్టి విగ్రహ ప్రతిష్టాపన నిర్వహించారు .భవాని మాతకు పూజ కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఇట్టి కార్యాక్రమానికి ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి హాజరై భవాని మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతిఒక్కరు దైవచింతన కలిగియుండాలని అన్నారు.ప్రతినిత్యం భవన్నామ స్మరణ చేస్తే కష్టాలు తొలగి సుఖసంతోషాలు లభిస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి దారాసింగ్,డిఎల్‌డిఏమాజీ చైర్మెన్ పి.నారాయన్‌రెడ్డి, మైనార్టీ కన్వీనర్ యండి,రియాజ్, మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు గోపాల్, మాజీ అధ్యక్షులు, సోసైటి డైరెక్టర్ ఎస్.నారాయన్‌రెడ్డి,ఏ బ్లాక్ అధ్యక్షులు లొంక నర్సిములు, మార్కెట్ కమిటి మాజీ ఉపాధ్యాక్షులు జితేందర్‌రెడ్డి, సీనియర్ నాయకులు కొమ్ము గోపాల్‌రెడ్డి,డాక్టర్ సంపత్‌కుమార్, గోపాలక్రిష్ణ, కోహీర్ రవి, డివై నర్సిములు, సంజీవరెడ్డి, రాధక్రిష్ణరెడ్డి, సాయిని శ్రీనివాస్‌రెడ్డి, రాజురెడ్డి, ఉప్పరి వీరేశం, ఉప్పరి రవి, గేమ్యానాయక్, తట్టెపల్లి నారాయన్ గౌడ్, యంపిటిసి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ చేస్తున్న అభివృద్ధి చూసే పార్టీలో చేరికలు

-మార్కెట్ కమిటి మాజీ వైస్ చైర్మన్ జితేందర్‌రెడ్డి



కాంగ్రెస్‌లో చేరిన ఆయాపార్టీల కార్యకర్తలు

**పెద్దేముల్, ఏప్రిల్ 30, ప్రభాతవార్త:** కాంగ్రెస్‌పార్టీ చేస్తున్న అభివృద్ధి చూసే పార్టీలోకి వలసలు కొనసాగుతున్నాయని తాండూరు మార్కెట్ కమిటి మాజీ వైస్‌చైర్మెన్ జితేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం పెద్దేముల్ మండలం దుగ్గాపూర్‌లో కాంగ్రెస్ ఇంచార్జులు జితేందర్‌రెడ్డి, సీనియర్ నాయకులు కిరణ్ అధ్వర్యంలో బిజెపి పార్టీ గ్రామ కమిటి అధ్యక్షుడు బి.మహేష్, వార్డు మెంబర్లు నర్సిములు, బుడిగ లాలప్ప తో పాటు 15 మంది ఆయా పార్టీలకు చెందిన కార్యకర్తలు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను చూసే పార్టీలోకి వలసలు ప్రారంభమాయ్యయని అన్నారు. పార్లమెంటు ఎన్నికలలో కాంగ్రెస్ విజయం సాధించడం ఖాయమని అన్నారు. ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి సారథ్యంలో గ్రామాలు అభివృద్ది పథంలో పయనిస్తున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అశోక్‌రెడ్డి,విష్ణువర్ధన్‌రెడ్డి, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలో ఉత్తమ ఫలితాలపై హర్షం

-విద్యార్థినులకు చైర్‌పర్సన్ సన్మానం..అభినందన



విద్యార్థినులను సనా ్మనించి అభినందిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ పావనియాదవ్

**ఘట్‌కేసర్, ఏప్రిల్ 30, ప్రభాతవార్త:**
ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు ఉత్తమ ఫలితాలను సాధించడం అభినందనీయమని మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్యయాదవ్ పేర్కొన్నారు. ఘట్‌కేసర్ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో పదవతరగతి పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థినులకు మంగళవారం ఆమె శాలువాలతో సన్మానించి అభినందించారు. జడ్పీహెచ్‌ఎస్‌లో 83 శాతం ఉత్తీర్ణత సాధించి ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాల 8 మంది విద్యార్థినులు మార్కులు పొందారని తెలిపారు. ఈపాఠశాలలో ఒక విద్యార్థిని 9.8 జీపీఏ ఉత్తీర్ణత సాధించి పాఠశాలకు మంచి పేరు తెచ్చారని తెలిపారు. ఈకార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు విజయకుమారీ, టీచర్లు పాల్గొన్నారు.

## ప్రజలకు ఉత్తమ సేవలు అందిస్తేనే గుర్తింపు



గ్రామకార్యదర్శి లింగారెడ్డిని సత్కరిస్తున్న ఎంపిపి సుదర్శన్‌రెడ్డి, ఎంపిడిఓ గీత తదితరులు

**ఘట్‌కేసర్, ఏ ప్రిల్ 30, ప్రభాతవార్త:**
గ్రామాల్లో ప్రజలకు మెరుగైన సేవలు అందించే అధికారులకు తగిన గుర్తింపు లభిస్తుందని ఎంపిపి ఏనుగు సుదర్శన్‌రెడ్డి అన్నారు. ఘట్‌కేసర్ మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం వెంకటాపూర్ పంచాయతీ కార్యదర్శి లింగారెడ్డికి అధికారులు, ప్రజాప్రతినిధులు సన్మానం చేశారు. గ్రామ కార్యదర్శిగా లింగారెడ్డి ఈనెల 30వ తేదీతో పదవీ విరమణ చేస్తుండటంతో ఎంపిపి సుదర్శన్‌రెడ్డితో పాటు వైఎస్ ఎంపిపి కర్రె జంగమ్మ, ఎంపిడిఓ గీతారెడ్డి, ఎంపిఓ రవి, ఎంపిటిసి సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు శాలువా, పూలదండలతో లింగారెడ్డిని సన్మానించి వీడ్కోలు పలికారు. ఈకార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు గట్టగళ్ల రవి, పులకంటి భాస్కర్‌రెడ్డి, కొమ్మిడి శోభారాణి, నిరుడి రామారావు, బొడ్డు వినోద, కోఆప్షన్ సభ్యులు ఎండి.ఇక్బాల్, గ్రామకార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

## పది పరీక్షా ఫలితాల్లో బాలికలదే హవా

-మండల టాపర్‌గా రావులపల్లి విద్యార్థి

**కొడంగల్,ఏప్రిల్ 30ప్రభాతవార్త**
పదవ తరగతి పబ్లిక్ పరీక్ష ఫలితాల్లో కొడంగల్ మండలం 57.2శాతం ఉత్తీర్ణత సాధించగా బాలికలదే హవా కొనసాగింది.కొడంగల్ జడ్పీహెచ్ ఎస్ బాలుర,బాలికల ఉన్నత పాఠశాలలు,రుద్రారం, పెద్దనందిగామ ,హస్నాబాద్,రావులపల్లి,కస్తూర్బా పాఠశాలల నుంచి మొత్తం 533 మంది విద్యార్థులు 10వ తరగతి పరీక్షలు రాయగా 295 మంది ఉత్తీర్ణ సాధించారు.అందులో బాలురు 76 మంది,బాలికలు 219 మంది ఉత్తీర్ణులైనట్లు మండల విద్యాధికారి రాంరెడ్డి తెలిపారు.కాగా కొడంగల్ ఎంజేపీటీ బాలుర పాఠశాలలో 100 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ తెలిపారు.పాఠశాలలో 67 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 67 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు.పాఠశాలకు చెందిన డి.సుగేందర్ 10/10 సాధించినట్లు తెలిపారు.అలాగే పాతకొడంగల్‌లోని తెలంగాణా రాష్ట్ర గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో 97శాతం ఉత్తీర్ణత సాధించగా పి.హరిచంద్ 10/10 మార్కులు సాధించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ బలరాం తెలిపారు.కాగా మండలంలోని రావులపల్లి జడ్పీహెచ్‌ఎస్ ఉన్నత పాఠశాల విద్యార్థి ఏ.శ్రీకాంత్‌రెడ్డి 9.3 సాధించి మండల టాపర్‌గా నిలిచారని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్యామలమ్మ తెలిపారు.

## వివిధ రకాల మెలకువలను రైతులు తెలుసుకోవాలి



**మొయినాబాద్ ఏప్రిల్30,ప్రభాతవార్త :**
మొయినాబాద్ మండలంలోని చిలుకూరు రెవెన్యూలో ఉన్నటువంటి రైతు వేదిక కార్యాలయంలో మొయినాబాద్ మండల వ్యవసాయ అధికారిని రాగమ్మ ఆధ్వర్యంలో రైతులకు రైతు నేస్తం కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.ముఖ్యఅతిథిగా హాజరైనటువంటి జిల్లా వ్యవసాయ అధికారి గీతారెడ్డి రైతులతో మాట్లాడుతూ...వేసవికాలంలో రైతులు కూరగాయల సాగుకు సంబంధించి వివిధ రకాల మెలకువలను రైతులు తెలుసుకొని శాస్త్రవేత్తల సూచనలు ,సలహాలు తీసుకొని సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు.ప్రతి మంగళవారం వివిధ పంటలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జరిగే రైతు నేస్తం ప్రోగ్రాంను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.తక్కువ మీరుతో వ్యవసాయ పంటలను దిగుబడి ఎక్కువగా వచ్చేటట్లు రైతులకు సూచనలు చేశారు.అనంతరం మొయినాబాద్ మండల కేంద్రంలో ఉన్న వివిధ ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు.డిలర్లు ఎరువులను అమ్మేటప్పుడు విధిగా ఫ్యాన్ మిషన్ అప్డేట్ చేయాలని బిజెపి ఉన్న దుకాణాల్లో రైతులకు అందుబాటులో ఉంచాలని వ్యవసాయ అధికారికి డీలర్లకు సూచించడం జరిగింది.డీలర్లు ఎంఆర్పి ధరకు మించి ఎరువులు అమ్మినట్లయితే చట్టరీత్యా కఠిన చర్యల తీసుకుంటామని డీలర్లను హెచ్చరించారు.రైతుల కూడా ఎరువుల విత్తనాల ,పురుగుల మందులు కొనుగోలు చేసేటప్పుడు తప్పకుండా తగిన చర్యలు తీసుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏఈఓలు కుమార్,సునీల్ కుమార్,రైతులు,తదితరులు పాల్గొన్నారు.

## బీటెక్ విద్యార్థి అదృశ్యం

**ఘట్‌కేసర్ రూరల్, ఏప్రిల్ 30, ప్రభాతవార్త:** బీటెక్ విద్యార్థి ఒకరు అదృశ్యం అయిన సంఘటన పోచారం ఐటీ కారిడార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం సంఘటన వివరా లు ఇలా ఉన్నాయి. ఘట్‌కేసర్ మండలం వెంకటాపూర్ అనురాగ్ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ ప్రథ మ సంవత్సరం చదువుతున్న అశ్రిత్ ( 19 ), కళాశాల హాస్టల్‌లోనే నివాసం ఉంటున్నట్లు పోలీసులు తెలిపారు. ఆశ్రిత్ ఏప్రిల్ 25 వ తేదిన హాస్టల్ గది నుండి బయటకు వెళ్లి తిరిగి రాలేదని తెలిపారు. మోబైల్ ఫోన్ సైతం గదిలో విడిచివెళ్లినట్లు పోలీసులు తెలిపారు. అశ్రిత్‌ది స్వంత నివాసం కరీంనగర్‌లోని సంతోశ్ నగర్‌వాసియని తెలిపారు. హాస్టల్‌లో నివాసం ఉంటున్న తోటి విద్యార్థులు అశ్రిత్ కనిపిం చడం లేదని కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. దీంతో అశ్రిత్ తల్లి బంధుమిత్రుల వద్ద కొడుకు కొరకు వెదకిన ఎలాంటి ఆచూకీ లభించలేదు. దీంతో విద్యార్థి తల్లి పి.అనిత పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. విద్యార్థి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోచారం ఐటీ కారిడార్ పోలీసులు తెలిపారు.

## పది ఫలితాల్లో మేడ్చల్ మండలంలో 77.41 శాతం ఉత్తీర్ణత

-నూతనకల్ విద్యార్థిని లక్ష్మీ ప్రసన్నకు 10 జిపిఎ

-గిర్మాపూర్ పాఠశాలలో 95.45 శాతం విద్యార్థుల ఉత్తీర్ణత

**మేడ్చల్, ఏప్రిల్ 30. ప్రభాతవార్త :** మేడ్చల్ మండలంలో పదో తరగతి విద్యార్థులు 77.41 శాతం ఉత్తీర్ణత సాధించారు. 611 మంది విద్యార్థులు పరీక్ష రాయగా అందులో 473 మంది పాసయ్యారు. మండలంలోని నూతన్‌కల్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని లక్ష్మి ప్రసన్న ఈ ఫలితాల్లో 10 జిపిఏ సాధించి మండలంలో మొదటి స్థానంలో నిలిచింది. గిర్మాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 22 మంది విద్యార్థులకు గాను 21 మంది విద్యార్థులు ఉత్తీర్ణులు కావడంతో 95.45 శాతం ఉత్తీర్ణత నమోదు సాదించి మడలంలోనే ఈ పాఠశాల మొదటి స్థానంలో నిలిచింది. మండలంలోని గౌడవెల్లి పాఠశాలలో 83.33 శాతం, మేడ్చల్ బాలుర ఉన్నత పాఠశాలలో 80.30 శాతం, మేడ్చల్ బాలికల ఉన్నత పాఠశాలలో 62.3 శాతం, గుండ్లపోచంపల్లి పాఠశాలలో 92.2 శాతం, పూడూర్ పాఠశాలలో 66.7శాతం, రావల్‌కోల్ పాఠశాలలో 78శాతం, మునీరాబాద్ పాఠశాలలో 62.5 శాతం, రాజబొల్లారం పాఠశాలలో 72.41 శాతం, అత్వెల్లి పాఠశాలలో 72. 7 శాతం, డబిల్‌పూర్ పాఠశాలలో 75 శాతం, శ్రీరంగవరం పాఠశాలలో 92 శాతం, నూతనకల్ పాఠశాలలో 64.5 శాతం మేర విద్యార్థులు ఉత్తీర్ణత సాదించినట్లు ఎంఈఓ వసంత తెలిపారు. కాగా మండలంలో ప్రథమ స్థానంలో నిలిచిన లక్ష్మి ప్రసన్నను ఎంఈవో పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

### కందుకూరు మండలంలో 10 వతరగతి ఉత్తీర్ణత 88.2 శాతం

**కందుకూరు, ఎప్రెల్ 30, ప్రభాతవార్త:** ప్రభుత్వం ప్రకటించిన పదవతరగతి 2023-24 బ్యాచ్ పరీక్షా పలితాలలో కందుకూరు మండలంలో ఉత్తీర్ణత శాతం 88.2 నమోదైనట్లు విద్యాశాఖ ప్రకటించింది. మండల పరిదిలో ప్రభుత్వం ప్రైవేటు, అదర్షపాఠశాల, గురుకుల పాఠశాలలు మొత్తం 21 పాఠశాలలనుండి 994 మంది విద్యార్థులు 10 వతరగతి పరీక్షలు రాయగా అందులో 877 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాదించారు. అందులో నేదునూరు అర్షపాఠశాల 93 శాతం ఉత్తీర్ణత సాదించి ప్రథమ స్తానంలో నిలువగా 92 శాతం ఉత్తీర్ణత సాదించి మీర్ఖాన్‌పేట ఉన్నతపాఠశాల ద్వితీయ స్తానంలొ నిలువగా అకులమైలారం, కందుకూరు బాలికల ఉన్నత పాఠశాలలు తరువాత స్తానాలలో నిలిచినట్లు మండల విద్యాశాఖ ప్రకటించింది. నేదురూరు అర్షపాఠశాల విద్యార్థిని పి ప్రణవి, కె కీర్తన 10 జిపిఎ సాదించారు వీరితోపాటు అయా పాఠశాలలనుండి పలువురు 10 జిపిఎ సాదించినట్లు తెలిపారు. ఉత్తమ పరలితాలు సాదించిన అయా పాఠశాలల ఉపాద్యాయులను విద్యార్థులను అయా గ్రామాల విద్యాకమిటీలతో పాటు గ్రామ పెద్దలు అభినందించారు. అదేవిదంగా మండలంలో మెరుగైన పలితాలు సాదించిన పాఠశాలలకు మండల విద్యాశాఖ పక్షాన మండల విద్యాధికారి మనోహర్ ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.

## పేదింటి ఇంటి నిర్మాణానికి చేయూత



సిమెంట్ బస్తాలు అందజేస్తున్న దృశ్యం

**కడ్తాల్,ఏప్రిల్ 30 ప్రభాతవార్త :**
కడ్తాల్ మండల కేంద్రంలోని రెండవ వార్డుకు చెందిన మంగళపల్లి మహేష్ ఇంటి నిర్మాణానికి కావలసిన 30 సిమెంట్ బస్తాలను రాధాకృష్ణ మెమోరియల్ చారిటబుల్ ట్రస్టు నుండి పేద కుటుంబానికి అందించిన ట్రస్టు చైర్మన్, మండల జడ్పీటిసి జర్పుల దశరథ్‌నాయక్‌లు అందజేశారు. ఈ సందర్భంగా జడ్పీటిసి మాట్లాడుతూ మండలంలోని నిరుపేద కుటుంబాలకు ట్రస్టు నుండి ఎల్లవేళలా మా సేవలు కొనసాగుతాయని అదేవింగా రాబోయే కాలంలో మరింత విస్తృతంగా మా సేవలను ప్రతి నిరుపేద కుటుంబాల ప్రతి ఇంటికి సేవచేసే విధంగా మా సేవలను ముందుకు తీసుకెళ్తామని తెలియజేశారు. కార్యక్రమంలో రైతు అధ్యక్షు లు బాలకృష్ణ,పవన్,టిఆర్ఎస్ యూత్ అధ్యక్షులు కొప్పుకృష్ణ,నాయకులు నరేష్ యాదవ్,కంబాలపల్లి అంజి,సురేష్,మహేష్, రాజశేఖర్, శ్రీకాంత్, శివ పాల్గొన్నారు.

## పదవ తరగతి ఫలితాలలో మండల టాపర్‌గా సంపత్‌కుమార్

-మండల విద్యాధికారి వెంకటయ్యగౌడ్

**పెద్దేముల్, ఏప్రిల్ 30, ప్రబాతవార్త:**
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం విడుదల చేసిన పదవ తరగతి ఫలితాలలో మండల టాపర్‌గామంబాపూర్ జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన సంపత్‌కుమార్ (9.3) నిలిచారు. ద్వితియ టాపర్లుగా పెద్దేముల్ జిల్లా పరిషత్ పాఠశాల ( బాలుర)కు చెందిన విద్యార్థులు భాను ప్రసాద్, వినయ్‌కుమార్ (9.0)లు నిలిచారని మండల విద్యాదికారి వెంకటయ్యగౌడ్ ఓ ప్రకటనలో తెలిపారు.మారెపల్లి కస్తూర్బా పాఠశాలలో 44 మంది విద్యార్థులకు గాను 21 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. జిల్లా పరిషత్ ఇందూరు (ఉర్దు మీడియం)10 మంది విద్యార్థులకు గాను 3, అడ్కిచెర్లలో 15 మందికి గాను 9, మారెపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో 16కు 7, తట్టెపల్లిలో 19 మందికి గాను13, పెద్దేముల్ బాలికల పాఠశాలలో 24కు గాను 11, ఇందూరులో 40కు గాను 13, కందనెల్లిలో 73కు గాను 29, మంబాపూర్‌లో 81కు గాను 33,పెద్దేముల్ బాలుర పాఠశాలలో 103కుగాను 57, పెద్దేముల్ టిఎస్ఎంఎస్‌లో 81కు గాను 32 ఉత్తీర్ణత సాధించారు. మండలంలో మొత్తము 506 మంది విద్యార్థులకు గాను 228 మంది విద్యార్థులు పాసై 45 శాతము ఉత్తీర్ణత సాధించారని యంఈఓ తెలిపారు.

## బీసీ సంక్షేమశాఖ వార్డెన్ రాములుకు సన్మానం



పదవి విరమణ పొందిన వార్డెన్ రాములును సన్మానిస్తున్న అధికారులు

**కొడంగల్,ఏప్రిల్ 30ప్రభాతవార్త**
ఉద్యోగ విరమణ పొందిన వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ పాలెం హాస్టల్ వార్డెన్ రాములును జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి ఖాజా నిజాం అలి,సహాయ సంక్షేమ శాఖ అధికారి,శ్రీధర్‌జిలు పూలమాలలు,శాలువాలతో ఘనంగా సన్మానించారు.కొడంగల్ మండలంలోని పర్సాపూర్ గ్రామానికి చెందిన రాములు పాలెం ఏ హాస్టల్‌లో వార్డెన్‌గా విధులు నిర్వహిస్తు మంగళవారం పదవి విరమణ పొందారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన రాములు సన్మాన కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ అధికారి ఖాజా నిజాం అలీ మాట్లాడుతు 39 సంవత్సరాల పాటు వివిధ హోదాల్లో రాములు భాద్యతాయుతంగా విధులు నిర్వహిస్తు బీసీ సంక్షేమ శాఖకు ఎనలేని సేవలు అందిస్తు అందరి మన్ననలు పొందారని కొనియాడారు. పదవి విరమణ ప్రతి ఉద్యోగికి సహజమని,విధి నిర్వహణలో వారు చేసిన సేవలు గుర్తుంటాయని అన్నారు.కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.

## పదిలో మండలంలో 66 శాతం ఉత్తీర్ణత

**బంట్వారం, ఏప్రిల్ 30 ప్రభాతవార్త:**
మంగళవారం వెలువడిన పదవ తరగతి ఫలితాల్లో మండలంలోని వివిధ పాఠశాలల్లో 66 శాతం విద్యార్థులు ఉత్తీర్ణతసాధించినట్లు మండల ఎంఈఓ చంద్రప్ప మంగళవారం తెలియజేశారు. మండల వ్యాప్తంగా ఉన్న జడ్పీహెచ్ఎస్ బంట్వారం 28 శాతం, జెడ్‌పిహెచ్ఎస్ సల్బత్తాపూర్ 100 శాతం, జడ్పీహెచ్ఎస్ తొరుమామిడి 19శాతం, జెడ్‌పిహెచ్ఎస్ తరుమామిడి (ఉర్దూ) 50 శాతం, కేజీబీవీ బంట్వారం 65 శాతం, తెలంగాణ మోడల్ స్కూల్ 64 శాతం, తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాల(తొల్‌కట్ట) 98 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఆయన తెలియజేశారు. కాగా ఇందులో బంటారం(తోలుకట్టలో కొనసాగుతున్న పాఠశాల) రెసిడెన్షియల్ పాఠశాలకు చెందిన విద్యార్థినీలు పి వైష్ణవి 10 జిపిఏ సాధించగా, కే కీర్తన 9.8 సాధించినట్లు వారు తెలియజేశారు మండల వ్యాప్తంగా ఉన్న పాఠశాలలో రెసిడెన్షియల్ పాఠశాల విద్యార్థులు అత్యధిక జిపిఎ సాధించగా మిగిలిన పాఠశాల వారు 7 జిపిఏ నుండి 9.5 జిపిఎ సాధించినట్లు వారు చెప్పారు.